14 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 136 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## రాహుల్ ఓట్‌చోరీ వ్యాఖ్యలపై విచారణ

పిల్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం

ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలన ఆదేశం





సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు..

# సంక్షేమహాస్టళ్లకు సత్వర చికిత్స

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు.



- విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఫేస్ రికగ్నేషన్
- ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశాలు...
- వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు
- టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు అందించే భోజనంపై క్వాలిటీ చెక్
- సంక్షేమహాస్టళ్ల పనితీరుపై అధికారులతో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13: రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన , బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా... జవాబుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని... దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్



పేదరిక నిర్మూలనకు

## తెలంగాణ మోడల్‌గా మారాలి

పేదరికంపై జరిగే తుది పోరులో విజయం సాధిస్తాం

పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

## ఐపిఎస్ అధికారి పూరన్ కుటుంబానికి భట్టి పరామర్శ

- కుటుంబానికి అండగా ఉంటామని హామీ



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

21 వరకు నామినేషన్ల స్వీకరణ

22న నామినేషన్ల పరిశీలన

24న నామినేషన్ల ఉపసంహరణ గడువు




హైదరాబాద్, అక్టోబర్13 (వెలుతురు): హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల పర్వం మొదలయ్యింది. నామినేషన్లను స్వీకరించడానికి చివరి తేదీ అక్టోబర్ 21 మంగళవారంగా నిర్ణయించింది. . అలాగే నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 22 బుధవారం నాడు జరుగుతుంది. అభ్యర్థిత్వం ఉపసంహరణకు చివరి తేదీగా అక్టోబర్ 24 శుక్రవారంగా నిర్ణయించారు. పోలింగ్ నవంబర్ 11న నిర్వహిస్తారు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరిపి అదేరోజు ఫలితం ప్రకటిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని

## అద్భుతంగా మేడారం అభివృద్ధి

గడువు లోగా పనులు పూర్తి చేయాల్సిందే

- మంత్రి సీతక్కతో కలసి మేడారం పనులపై సమీక్ష

70 కోట్ల కాంట్రాక్ట్ కోసం కక్కుర్తి పడే మనిషిని కాదు

- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి వ్యాఖ్య



ములుగు,అక్టోబర్13( వెలుతురు): మేడారం అభివృద్ధికి రూ.212 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిధులు ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, మేడారంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలని సూచించారు. అభివృద్ధి పనులపై అందరి సూచనలు తీసుకుంటాం. కేవలం ప్రాంగణం అభివృద్ధి కోసమే రూ.101 కోట్లు కేటాయించామన్నారు. ఎంత ఖర్చయినా సరే.. మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం అని తెలిపారు. మేడారం అభివృద్ధి పనులను మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. మేడారం గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన

## జూబ్లీహిల్‌లో కాంగ్రెస్ గుర్తుతో మజ్లిస్ పోటీ

బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరును ప్రజలు గుర్తించారు

బిజెపికే గెలుపు అవకాశాలు ఉన్నాయి

నేడు అభ్యర్థిని ప్రకటిస్తామన్న రామచంద్రరావు



హైదరాబాద్, అక్టోబర్13 (వెలుతురు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఇందుకు సంబంధించి ప్రధాన పార్టీలు వారి అభ్యర్థుల ఖరారుపై సన్నాహాలు మరింత



## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అక్రమాలు

ఓటర్లను భయపెడుతున్న అధికార కాంగ్రెస్

ఎన్నికల సంఘానికి కెటిఆర్ ఫిర్యాదు

## యుద్ధవిరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

పార్లమెంటులో ప్రసంగం..స్వాగతించిన ఎంపిలు

ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ అభినందనలు

అమెరికా అండ ఎల్లవేళలా ఉంటుందని హామీ



## ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

ఎపి పర్యటనకు ప్రత్యేకంగా ఆహ్వానం



## ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం



- వారికి చెక్ పెట్టాలంటే బిఆర్ఎస్ గెలవాలి
- కారు-బుల్డోజర్ ఫైట్‌లో మనదే గెలుపు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు): బుల్డోజర్ పాలనను అడ్డుకోవడానికి కారుకు ఓటేయాలని కెటిఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో మన గెలుపు ఖాయం, మెజార్టీ తెచ్చుకోవడమే మన చేతుల్లో ఉందని తాజాగా జరిగిన సభలో ఆయన వ్యాఖ్యానించారు. ఈ నెల రోజులు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలకు చెప్పాలని.. కారు, బుల్డోజర్ మధ్య

# ప్రపంచంలోనే అద్భుత నగరిగా అమరావతి

- రాజధాని రైతుల త్యాగాన్ని మరువలేం
- వారు పడ్డ కాష్టాలన్నీ గుర్తున్నాయి
- వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత మాదే
- సిఆర్‌డిఎ కార్యాలయ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు

అమరావతి,అక్టోబర్13( వెలుతురు): దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యద్భుత నగరంగా అమరావతి రాజధాని నిర్మాణం కాబోతున్నదని సిఎం చంద్రబాబు అన్నారు. దేవతల రాజధాని అమరావతి ఎలా ఉంటుందో కానీ, మన రాజధాని అమరావతి అంతకుమించి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది కేవలం రాజధాని మాత్రమే కాదని,




మనభవిష్యత్ ఆశలకు తార్కాణంగా ఉంటుందన్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. భూములు ఇచ్చిన రైతుల అవస్థలు చూశానని.. రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం

# ఐపీఎస్ అధికారి పూరన్ కుటుంబానికి భట్టి పరామర్శ

**న్యూఢిల్లీ,అక్టోబర్13( వెలుతురు):**

చండీఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరామర్శించారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో భట్టి ఫోన్‌లో మాట్లాడించారు. సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భండి భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోట్ ఆధారంగా ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

# ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం

యుద్ధం జరుగుతుందని, రాష్ట్రం అంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోందని ఆయన అన్నారు. అలాగే అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇస్తామని రేవంత్ రెడ్డి ఒక కాగితం ఇచ్చాడు. కానీ, కోర్టు కేసులో ఉన్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ రావడం అసాధ్యం అన్న విషయం రేవంత్‌కే తెలుసునని ఎద్దేవా చేశారు. ఇది కేవలం ఓట్ల కోసమే చేస్తున్న రాజకీయ నాటకమని, గెలవలేక పక్క దారులు పడుతున్నారని ఆయంబ విమర్శలు గుప్పించారు. ఒక్క ఇంట్లోనే 40 దొంగ ఓట్లు రాయించుకున్నారని విమర్శించారు. గత ఎమ్మెల్యే గోపీనాథ్ మరణంపై ఆయన సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆ కుటుంబం అనాధ కాదు. ఆ కుటుంబానికి మేమందరం అండగా ఉన్నాం. ఈరోజు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరం జూబ్లీహిల్స్‌లో వారికి బలం ఇవ్వడానికి వచ్చాం అని అన్నారు. ఇక జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని.. ప్రజలు మన దిక్కు ఉన్నారని, నిజం మన దిక్కు ఉంది, ధర్మం మన దిక్కు ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ మోసం చేసినందుకు ప్రజలు స్వయంగా సమాధానం చెబుతారని.. మోసపోయిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు, ఈసారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ నెల రోజులు ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి నిజం చెప్పాలని.. జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగరడం మనందరి లక్ష్యం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పెద్దలు ముసలమ్మలకు, ముసలయ్యలకు నెలకు రూ.4000 ఇస్తామని చెప్పారు. ఇప్పుడు 24 నెలలు గడిచాయి.. ఒక్క పైసా ఇచ్చారా? బాకీ మొత్తం రూ.48,000 అయ్యింది. అలాగే 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పిన హామీ కూడా నెరవేర్చలేదు. నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకం అన్నీ మాటలకే పరిమితం అయ్యాయని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బాకీల లెక్కను ప్రజల ఇంటింటికీ తీసుకెళ్లాలి. ప్రతి ముసలమ్మకు రూ.48,000, ప్రతి మహిళకు రూ.50,000 బాకీ ఉన్నదని బాకీ కార్డుతో చెప్పాలి. ఈ సారి కాంగ్రెస్ మోసానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు.

# ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

**న్యూఢిల్లీ,అక్టోబర్13 ( వెలుతురు):**

ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. 45 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. వివిధ అంశాలపై చర్చించారు. సీఎం వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. కర్నూలులో ఈ నెల 16న 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమానికి, విశాఖలో జరిగే సీఐఐ సదస్సుకు ప్రధానిని చంద్రబాబు ఆహ్వానించారు. ప్రజాసేవలో 25 ఏళ్లు గడిచిన సందర్భంగా ప్రధానికి అభినందనలు తెలిపారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ తరఫున ప్రధానికి కృతజ్ఞతలు చెప్పినట్లు భేటీ అనంతరం చంద్రబాబు చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇదిలావుంటే 16న సిఎం శ్రీశైలం పర్యటన ఖరారు అయ్యింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

# యుద్ధవిరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

**టెల్అవీవ్,అక్టోబర్13( వెలుతురు):**

హమాస్‌తో యుద్ధ విరమణను స్వాగతిస్తూ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. థాంక్యూ వెరీమచ్ బీబీ, గొప్పపని చేశావని ప్రధాని బెంజమిన్ నెతన్యాహును పొగిడారు. రెండేళ్లుగా తమ చెరలో ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ.. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఉదయిస్తోంది. ఈ పవిత్ర భూమిలో శాంతి వీచికలు వీస్తుండగా ఆకాశం నిర్మలంగా మారింది. తుపాకులు మూగబోయాయి. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైంది. బందీలు తిరిగివచ్చారు. ఈ మాట చెప్పడం ఎంతో బాగుంది. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి మేం సమయాన్ని వృథా చేస్తున్నామని చాలామంది అన్నారు. కానీ మేం సాధించాం అని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో యూదులపై నాజీలు సాగించిన నరమేధం హోలోకాస్ట్ తర్వాత యూదులపై జరిగిన అత్యంత దారుణంగా అక్టోబర్ 7 దాడులను అభివర్ణించారు. అమెరికా ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని బాధిత కుటుంబాలను ఉద్దేశించి పేర్కొన్నారు. అలాగే మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు, సలహాదారుడు జేర్డ్ కుష్నర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. ఇజ్రాయెల్- హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో వీరు కీలకపాత్ర పోషించారు. అయితే ట్రంప్ మాట్లాడుతోన్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తంచేశారు. మారణహోమం అంటూ నినాదాలు చేశారు. దాంతో వారిని చట్టసభ నుంచి బయటకు పంపివేశారు. ఈ నిరసనలపై ట్రంప్‌నకు స్పీకర్ క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారమంతా గమనించిన ట్రంప్.. సమర్థవంతంగా పనిచేశారని చమత్కరించారు. దాంతో సభ్యులంతా చిరునవ్వులు చిందించారు. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయెల్ చట్టసభ్యులు అగ్రరాజ్య అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. కాల్పులు ఒప్పందం చేసినందుకు గానూ.. రెండున్నర నిమిషాలు పాటు లేచి నిలబడి కరతాళధ్వనులతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ఎప్పుడూ తోడుగా ఉంటుందని హామీనిచ్చారు. ఈ సమయంలో ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో కాస్త గందరగోళం నెలకొంది. ట్రంప్ మాట్లాడుతున్న సమయంలో పాలస్తీనా-ఇజ్రాయెల్ జాయింట్ పొలిటికల్ పార్టీకి చెందిన ఎంపీ ప్లకార్డు ప్రదర్శించారు. 'పాలస్తీనాను గుర్తించాలి' అంటూ నినాదాలు చేశారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అక్రమాలు

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలను కాంగ్రెస్ నేతలు ప్రలోభపెడుతున్నారని, ఓటర్లను భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు కాంగ్రెస్ పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి సోమవారం బీఆర్కే భవన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో పలు అంశాలని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నేతలు పెద్ద కుట్రకు తెరలేపారని ఆక్షేపించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ అవుతోందని అంటుంటే, జూబ్లీహిల్స్‌లో మాత్రం కాంగ్రెస్ నేతలే ఓటు చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లని సృష్టించారని ఫైర్ అయ్యారు. ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పిర్యాదు చేశానని తెలిపారు. కొవ్వూరి కార్తీక్ పేరుతో మూడు చోట్ల ఓట్లు ఉన్నాయని.. దీపక్ శర్మ అనే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. కింది స్థాయి అధికారులు కాంగ్రెస్‌తో కుమ్మక్కై దొంగ ఓట్లను సృష్టించారని మండిపడ్డారు. దొంగ ఓట్ల పైన విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కైన కింది స్థాయి అధికారులపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేలోపు 20 వేల దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక జరగాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

# అద్భుతంగా మేడారం అభివృద్ధి





గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు మంత్రి. 90 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అన్నారు. రాతి కట్టడాలకు కావల్సిన గ్రానైట్ పొరుగు రాష్ట్రాల నుండి తెప్పిస్తున్నట్లు చెప్పారు. శాశ్వత ప్రతిపాదకన పనులు చేస్తున్నామని అన్నారు.ఆదివాసీల ఆచార సంప్రదాయాలకు విఘాతం కలుగకుండా నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. గత జాతరకు కోటిమంది భక్తులు హాజరయ్యారని.. ఈసారి భక్తుల సంఖ్య డబుల్ అవుతుందని అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇక ఇటీవల తనపై వచ్చిన విమర్శలపై కూడా మంత్రి పొంగులేటి స్పందించారు. నేను ఏంటో అందరికీ తెలుసు. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం తాపత్రయపడే అవసరం లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మబుద్ధి కావడం లేదు. నా మీద ఫిర్యాదు చేయడానికి అసలు ఏం ఉంది. సీతక్క, సురేఖ ఇద్దరూ సమ్మక్క-సారక్కలాగ పనిచేస్తున్నారని పొంగులేటి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనపై మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేశారని అనుకోవటం లేదని అన్నారు. తనపై ఫిర్యాదు చేయటానికి ఏముంటుందని అన్నారు. రూ.70 కోట్ల కాంట్రాక్ట్ కోసం తాపత్రయ పడే అంత అవసరం తనకు లేదన్నారు. అయితే తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపిన విషయం తెలిసిందే.



# పేదరిక నిర్మూలనకు తెలంగాణ మోడల్‌గా మారాలి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13:**

అంతర్జాతీయ సంస్థ బ్రాక్ (BRAC) తెలంగాణలో అమలు చేస్తున్న తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమం (TGILP) పేదరికంపై తుది పోరాటంగా మారాలని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. ఆ పోరాటంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. పేదరికంపై తుది పోరులో విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్కను బ్రాక్ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తెలంగాణలో TGILP సాధించిన పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన దిశలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి బ్రాక్ సంస్థ తమ వంతు సహకారం అందించాలన్నారు. అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే TGILP లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక వనరులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా జీవనోపాధి కార్యక్రమాలను రూపకల్పన చేయాలని సూచిస్తూ, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో విరివిగా లభించే ఇప్ప పువ్వు ఆధారంగా నూనె, ఆహార పదార్థాలు తయారీకి సంబంధించిన కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారు. "స్వచ్ఛమైన ఇప్పపువ్వు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుంది. దానిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి ఆదాయ వనరుగా మలచవచ్చు" అని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఐదు జిల్లాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో TGILP అమలవుతోందని, ఇప్పటి వరకు 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించినట్లు బ్రాక్ ప్రతినిధులు మంత్రి సీతక్కకు నివేదించారు. ఎంపిక చేసిన మహిళా సమాఖ్యల ద్వారా 108 మంది నిపుణులను నియమించి లబ్ధిదారులకు శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. TGILP కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు దీర్ఘకాలిక ఆదాయ మార్గాలను కల్పించి, వారిని ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరిన్ని జిల్లాలు, మండలాలకు విస్తరించాలని... ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన, పీవీటీజీ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మంత్రి సీతక్క సూచనలను సానుకూలంగా స్పందించిన బ్రాక్ ప్రతినిధులు..మరో 8 వేల కుటుంబాలకు నైపుణ్య శిక్షణతో పాటు వారి ఆదాయ మార్గాలను పెంచే విధంగా ఆర్థిక చేయుత అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రెగరీ చెన్ (మేనేజింగ్ డైరెక్టర్, Ultra Poor Graduation Initiative), శ్వేతా బెనర్జీ (ఇండియా లీడ్), ఉషా రాణి (ప్రోగ్రాం లీడ్), వి. రమేష్ (సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్), అభిషేక్ (ప్రోగ్రాం అసోసియేట్) తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పేదరిక నిర్మూళన కోసం తమ వంతు సహకారం అందిస్తున్న బ్రాక్ ప్రతినిధులను మంత్రి సీతక్క సత్కరించి వారి ప్రయత్నాన్ని అభినందించారు.


# రాహుల్ ఓట్‌చోరీ వ్యాఖ్యలపై విచారణ

**న్యూఢిల్లీ,అక్టోబర్13( వెలుతురు):**

రాహుల్ చేసిన ఓట్ చోరీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాహుల్ ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా



బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు భాజపా నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు. తాజాగా దీనిపై పిల్ వేయగా సుప్రీం తిరస్కరించింది. ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల జాబితా అవకతవకలపై ఆగస్టు 7న రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఉటంకిస్తూ న్యాయవాది, కాంగ్రెస్ సభ్యుడు రోహిత్ పాండే ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల జాబితా సన్నాహకాలు, నిర్వహణ, పబ్లికేషన్ విషయాల్లో ఈసీ పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోర్టును ఆయన కోరారు. అర్థవంతమైన వెరిఫికేషన్, ఆడిట్, పబ్లిక్ స్క్రూటినీకి వీలుగా మెషీన్-రీడబుల్ ఫార్మెట్‌లో ఎన్నికల జాబితాను పబ్లిష్ చేయాలని కూడా కోరారు.




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

# నోటిఫికేషన్ విడుదల

రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్లను ఫారం-2బిలో దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి తప్పనిసరిగా ఫారం-26లో అఫిడవిట్‌ను సమర్పించాలి. అన్ని పత్రాలపై అభ్యర్థి సంతకం, నోటరీ సంతకం, నోటరీ సీల్‌తో నోటరైజ్ చేయాలి. అక్టోబర్ 19 ఆదివారం, అక్టోబర్ 20 దీపావళి తేదీల్లో పబ్లిక్ సెలవులు కారణంగా నామినేషన్లను స్వీకరించబడవు. ఇక ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి కనీసం 25 సంవత్సరాలు నిండి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రపోజర్‌గా ఉండాలి. ఇతర అభ్యర్థులకు మాత్రం నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రపోజర్లుగా ఉండాలి. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ విషయానికి వస్తే జనరల్ కేటగిరీకి రూ.10,000, ఎస్సీ/ఎస్టీ కేటగిరీకి కుల ధృవీకరణ పత్రంతో పాటు రూ.5,000 నగదు చెల్లించాలి.

# ప్రపంచంలోనే అద్భుత నగరిగా అమరావతి

ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు వస్తాయి. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితిలో విభజన జరిగింది. రాజధాని ఎక్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం. అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది ఒక్క అమరావతిలోనే. గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5 వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారని చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఇక్కడి రైతులు కూడా బాగుపడతారని హామీ ఇస్తున్నానని అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించడానికి నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారని.. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారని అన్నారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టిందని విమర్శించారు. రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. బెస్ట్ రాజధాని నిర్మిస్తున్నామని... గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూమి కావాలని.. ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారని అన్నారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించామని.. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు తనకు దారి చూపారని సీఎం వెల్లడించారు. రైతులు ఐదు సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని.. రాజధాని వేశ్యల ప్రాంతమని మాట్లాడారని.. ఎడారి, స్మశానం అన్నారని మండిపడ్డారు. ఇంత మంచి ప్రాంతం ఎక్కడా ఉండదన్నారు. 30, 40 లక్షల ఎకరాలు సాగు చేసే నది కృష్ణా నది ఇక్కడ పారుతోందని, ప్రపంచంలో ఎక్కడా లేని సిటీ అమరావతి అని తెలిపారు. ఇక్కడ గ్రీనరీ అద్భుతంగా వస్తుందని.. ఇక్కడ బ్లూ , గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పుకు మీరు, నేను, రాష్ట్ర ప్రజలు ఎంత అనుభవించారో చూశారు. ఇకపై ఎన్డీఏ ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి. అమరావతి కన్నా విశాఖ ముందుకు వెళుతోంది. అమరావతికి శంకుస్థాపన సమయంలో పవిత్ర ప్రాంతాల నుంచి మట్టి నీరు తెచ్చారు. పార్లమెంట్ మట్టి, యమునా నది నీటిని ప్రధాని తెచ్చారు. అందుకే అమరావతి నిలిచింది. రైతులను నేను మరిచిపోను.. మరిచిపోతే త్యాగాన్ని మరిచిపోయినట్టే' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంతో ఆదాయం సృష్టిస్తుందన్నారు. హైదరాబాద్ ఇప్పుడు తెలంగాణకు 70శాతం ఆదాయాన్ని సమకూరుస్తోందని అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశాఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# పూరన్ ఆత్మహత్య విచారకరం

**- ఐపీఎస్ సూసైడ్ పట్ల ఇందిరా శోభన్ దిగ్భ్రాంతి**

**- డీజీపీ సహా బాధ్యులైన ఉన్నతాధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**



యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన హరియాణా ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఘటనపై తీవ్ర విచారకరం వ్యక్తం చేశారు కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అన్ని విభాగాల్లోనూ కుల వివక్షత కొనసాగుతుందనడానికి ఈ దుర్ఘటన నిదర్శమన్నారు. అధికార పక్షపాత ధోరణి వల్ల అత్యున్నత స్థాయిల్లో ఉన్న బ్యూరోక్రాట్స్ కూడా వేధింపులకు గురవుతుండడం నిజంగా దుర్మార్గమన్నారు. ఐపీఎస్ పూరన్ బలవన్మరణ ఘటన హరియాణా ప్రభుత్వానికే సిగ్గుచేటన్నారు. సర్వీసులో ఉన్న ఉన్నతాధికారుల పరిస్థితి ఇలా ఉంటే, ఇక క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు, సిబ్బంది పరిస్థితి ఏంటని ఇందిరా శోభన్ ప్రశ్నించారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో, ఇప్పటికీ కులవివక్ష కొనసాగతుందటే, దేశం ఎటువైపు వెళుతుందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. తన ఆత్మహత్యకు డీజీపీ సహా పలువురు ఉన్నతాధికారులు కారణమంటూ.. పూరన్ తన సూసైడ్ లేఖలో పేర్కొన్నారని, వారందరినీ తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఇందిరా శోభన్ కోరారు.

# జాతీయ రికార్డును బద్దలు కొట్టి స్వర్ణ పథకం సాధించిన బీసీ గురుకుల విద్యార్థి

**- అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,**

**- బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్**

**- ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు**




**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**

హనమ్‌కొండ బాయ్స్ బీసీ గురుకుల పాఠశాల లో పదో తరగతి చదువుతున్న లవ్లిత్ సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య'లో పాల్గొన్ని జాతీయ రికార్డు ను బద్దలు కొట్టి స్వర్ణ పతకం సాధించాడు. భువనేశ్వర్‌లో నిర్వహించిన నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ట్రయథ్లాన్ కేటగిరీలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి కంచు లవ్లిత్ బంగారు పతకాన్ని సాధించాడు. తెలంగాణకు చెందిన లవ్లీత్.. ట్రయథ్లాన్ ఈవెంట్లో స్వర్ణ పతకం సాధించి రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయిలో నిలబెట్టాడని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రటరీ శ్రీధర్, ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. 2510 పాయింట్లతో జాతీయ రికార్డును బద్దలు కొట్టడం అభినందనీయం అన్నారు . విద్యార్థుల్లో ఉన్నా క్రీడా స్ఫూర్తిని గుర్తించి ప్రభుత్వం వారిని ప్రోత్సహించడం ద్వారా జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని క్రీడా పోటీల్లో తెలంగాణ విద్యార్థులు పతకాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

## సంక్షేమహాస్టళ్లకు సత్వర చికిత్స



చేయాలని సీఎం ఆదేశించారు. హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ వైద్య కళాశాలలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు తరచూగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు , సిబ్బంది జీతాలు , డైట్ ఛార్జీలు , నిర్వహణ ఖర్చులు , ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్, క్షితిజ, నిర్మల క్రాంతి వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం స్పోర్ట్స్ హబ్ గా మారబోతుంది

**- క్రీడాకారులకు అత్యున్నత క్రీడా శిక్షణకు ప్రభుత్వం కృషి**

**- క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**





తెలంగాణ రాష్ట్రం స్పోర్ట్స్ హబ్ గా మారబోతుందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన "తెలంగాణ క్రీడా శాఖ – ఇటలీకి చెందిన జువెంటస్ ఫుట్ బాల్ సంయుక్త నిర్వహణలో "తెలంగాణ ఐ జువెంటస్ స్పోర్ట్స్ డిప్లమసీ ఇనిషియేటివ్" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్,సాట్ చైర్మన్ శివసేన రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ క్రీడాకారుడైన ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణ అతి ముఖ్యమైనదని, ప్రభుత్వాలు సంస్థలు కోచులు చేస్తున్న ప్రయత్నాలకు క్రీడాకారుడు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తేనే అంతిమ విజయం సాధ్యమవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎంతో చారిత్రాత్మకమైన ఫుట్ బాల్ క్రీడా వారసత్వం కలిగిన హైదరాబాద్ నగరంలో ఫుట్ బాల్ క్రీడా పునర్వైభవం కోసం ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తుందని అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి గారు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రతి క్రీడాంశంలో అత్యున్నతశ్రేణి మెరుగైన శిక్షణ ఇప్పించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ జువెంటస్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మరియు విజయవంతమైన ఫుట్‌బాల్ సంస్థల్లో ఒకటి ఆటగాళ్ల మరియు కోచ్‌ల అభివృద్ధిలో తమ దశాబ్దాల అనుభవాన్ని ఈ ప్రత్యేక భాగస్వామ్యంలో తీసుకువస్తోందని వివరించారు.ఇటలీ నుండి వచ్చిన జువెంటస్ నిపుణ కోచ్‌ల బృందం 2025 అక్టోబర్ 11 నుండి 17 వరకు హైదరాబాద్‌లో యువ ఫుట్‌బాల్ క్రీడాకారులు మరియు స్థానిక కోచ్‌లకు శిక్షణ శిబిరాలను నిర్వహించనుంది.ఈ శిబిరాలు టెక్నికల్ ఎక్సలెన్స్, టీమ్‌వర్క్, డిసిప్లేన్ మరియు గ్లోబల్ స్పోర్ట్స్‌మన్‌షిప్ వంటి యొక్క ముఖ్య విలువలపై దృష్టిసారిస్తాయని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి గారి,మంత్రి వాకిటి శ్రీహరి నాయకత్వంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ గత ఏడాదిన్నర కాలం నుండి క్రీడల అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కోచ్ లు లుకా కొరోనా - UEFA B, ఫ్రాన్సెస్కో బెల్లామెల్లి - UEFA A,సెబాస్టియానో డిస్కో - UEFA B లను క్రీడా శాఖ తరఫున ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి, ఇటలీ కన్సూలేట్ జనరల్ (బెంగుళూరు) పలువిద్యాసంస్థల చైర్మన్ కే టి మహి, తదితరులు పాల్గొన్నారు.

# గరిక పూల చెలిమ కవి యాకూబ్








**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**

"గరికపూల చెలిమ కవియాకూబ్" అని ప్రముఖ కవి, వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ డా. గోరేటి వెంకన్న కొనియాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో కవి యాకూబ్ 'సృజన సమాలోచన సదస్సు' సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాకూబ్ ఒక గొప్ప తాత్విక కవిగా మనుషుల గురించి, మనుషుల జీవితం గురించి తన 40 ఏళ్ల కవిత్వ ప్రయాణంలో పలవరించాడని అన్నాడు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు మల్లు రవి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తాను కలుసుకోలేని చాల మంది కవులను, రచయితలను కలుసుకోవడం ఆనందంగా ఉందని, కవి యాకూబ్ కవిసంగమం ఫేస్ బుక్ సామాజిక మాధ్యమంలో తెలుగు కవిత్వాన్ని విస్తరించడం చాల మంచి విషయమని ఆయనను అభినందించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ కవి, విమర్శకుడు వేరువేరు కాదు, విమర్శకుడైన కవి అసలైన కవిత్వాన్ని సృజిస్తాడని చెబుతూ అటువంటి కవి యాకూబ్ అని అన్నారు. పాటగాడిగా ప్రారంభమై కవి యాకూబ్‌గా పరివర్తన చెందిన విధానాన్ని వివరించారు. ఆకలి యాకూబ్ కవితా నేపథ్యాన్ని రచించిందన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలు అస్తిత్వ ఉద్యమాలు యాకూబ్ ను మానవీయ హృదయం కలిగిన వ్యక్తిగా, కవిగా తీర్చిదిద్దాయని అన్నారు. ఖమ్మం నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడిగా యాకూబ్ ఎదుర్కొన్న జీవితాన్ని అది ప్రతిఫలించిన కవిత్వాన్ని చదివి వినిపించారు. ఈ సదస్సు కన్వీనర్ డా. చంద్రయ్య శివన్న మాట్లాడుతూ రాచమల్లు రామచంద్రారెడ్డి మీద పరిశోధన చేసిన సాహసి యాకూబ్ అని కొనియాడారు. ఈ సదస్సులో యాకూబ్ కవిత్వం మీద ఆరుగురు, విమర్శ మీద ఐదుగురు తమ పరిశోధన పత్రాల్ని సమర్పించారు. తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్ మాట్లాడుతూ రచయిత చనిపోయిన తర్వాత కంటే బతికున్నప్పుడే సాహిత్య కృషిపై సదస్సు నిర్వహించడం ఎంతో ఉచితంగా ఉంటుందన్నారు. ప్రారంభ సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి గారు మాట్లాడుతూ కవి యాకూబ్ కవి సంగమం ద్వారా కొన్ని వేల మంది యువ కవులని తయారు చేశాడని కొనియాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి డా. నామోజు బాలాచారి మాట్లాడుతూ యాకూబ్ లాంటి మానవీయ హృదయం ఉన్న కవి తెలంగాణలో పుట్టడం తెలంగాణకే గర్వకారణం అని అన్నారు. విశిష్ట అతిథులుగా డా. సంగిశెట్టి శ్రీనివాస్, ప్రసేన్, సీతారాం, లక్ష్మీనరసయ్య, జూపాక సుభద్ర, స్కై బాబా పాల్గొని యాకూబ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, ముచ్చర్ల దినకర్ సమన్వయకర్తలుగా వ్యవహరించగా సమావేశంలో అధ్యక్షులుగా కటుకోజ్వల ఆనందాచారి, నాళేశ్వరం శంకరం వ్యవహరించారు. మెర్సీ మార్గరెట్, నరేష్ కుమార్ సూఫీ %&% ఇతర సాహితీ ప్రముఖులందరూ పాల్గొని కవి యాకూబ్ ను అభినందించారు. నిజాం కళాశాల విద్యార్థులు పెద్ద మొత్తంలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# మంథనిలో ఎటిసి కేంద్రం ఏర్పాటు

### రూ.45 కోట్లతో ఏటీసీ కేంద్రం,సామాజిక భవన నిర్మాణం

### మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**పెద్దపల్లి,అక్టోబర్13( వెలుతురు):**



రాబోయే విద్యా సంవత్సరం నుంచి మంథనిలో ఏటీసీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంథని ప్రాంతాన్ని సరస్వతి నిలయంగా అభివృద్ధి చేస్తామని శ్రీధర్ బాబు అన్నారు. మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంథనిలో రూ.45 కోట్ల వ్యయంతో నూతన ఏటీసీ కేంద్రం, సామాజిక భవనాల నిర్మాణాలకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించే దిశగా కేంద్రాలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా ఆధునీకరణ చేశామన్నారు. ఏటీసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అభిస్తాయని, ఇటీవలే కాటారంలో రూ.35 కోట్లతో ఏటీసీని ప్రారంభించామన్నారు. రామగిరి, కమాన్పూర్, ముత్తారం, మంథని మండలాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 38 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ వెంకన్న, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమారస్వామి పాల్గొన్నారు.

## జూబ్లీహిల్‌లో కాంగ్రెస్ గుర్తుతో మజ్లిస్ పోటీ

దూకుడును పెంచాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. అనేక మంది విద్యావంతులు, మేధావులు బీజేపీలో చేరుతున్నారని.. మంగళవారం నాటికి జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు .అక్కడ కాంగ్రెస్ పోటీ చేస్తుందా, లేక మజ్లిస్ పోటీ చేస్తుందా అనేది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. ప్రస్తుతం మజ్లిస్ అభ్యర్థి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేస్తున్నారు. హస్తం గుర్తుతోనే పతంగి ఎగరేస్తున్నారు. ఇది జూబ్లీహిల్స్ ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. ఇకపోతే, జూబ్లీహిల్స్‌ను ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని.. అక్కడ ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా లేదన్నారు. ఇంకా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని.. అవన్నీ 420 కేసులే అన్నారు. బీజేపీనే గెలిపించాలని ప్రజలను కోరుతున్నామని ఆయన అన్నారు. నిజమైన ప్రతిపక్షంగా మేమే కాంగ్రెస్‌ను నిలదీస్తాం అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ పార్టీలో గెలిచినవాళ్లు ఆ పార్టీలో ఉంటారో లేదో తెలియదన్నారు. చివరికి వాళ్లు పార్టీ మారక తప్పదని.. పార్లమెంట్ ఎన్నికలలో మరో పార్టీ నుండి బి ఫార్మ్ తీసుకుని పోటీ చేసే పరిస్థితి వస్తుందని అన్నారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలుస్తుందనే నమ్మకం మాకు ఉందని ధీమా వ్యక్తం చేశారు.ఇవ ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తోందా?మజ్లిస్ పోటీ చేస్తోందా? అని భాజపా ప్రశ్నించారు. కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ నుంచి పోటీ చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత మజ్లిస్ అధినేతను ఆయన కలిశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పాలనను జూబ్లీహిల్స్ ప్రజలు చూశారు. ఈ రెండు పార్టీలు నగరాన్ని అధ్వానంగా తయారు చేశాయి. విశ్వనగరం చేస్తామన్న భారత రాష్ట్ర సమితి.. విషాద నగరంగా మార్చింది. జూబ్లీహిల్స్ ప్రజలు భాజపాను ఆదరించాలి. నియోజకవర్గంలోని మేధావులు, సినీ ప్రముఖులు మా పార్టీకి ఓటు వేస్తారని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు.

# సంపాదకీయం.. ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు ?

ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్టం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఎపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు. ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అసవరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ధి చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ధి చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు.ప్రభుత్వపరంగా




వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా విమర్శలు చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శలు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు గల కారణాలను వివరించి ఉంటే ఈ పంచాయితీ వచ్చేది కాదు. నిజానికి వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాదిమంది విద్యార్థులు కోట్లాది రూపాయలను విదేశాలకు తగలేస్తున్నారు. అలా కాకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యవిద్యను అందించగలిగితే డబ్బు వృధాకాదు. అంతేకాకుండా వాటికి అనుబంధంగా ఆస్పత్రులను బలోపేతం చేయాల్సి ఉంది. ఫ్యాకల్టీని, వైద్యులను కూడా సిద్ధం చేసుకోవాలి. ఈ రకమైన ప్రయత్నాలు కూడా ప్రత్యామ్నాయంగా సాగాలి. వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయం కూడా కాదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా,వైద్యరంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితులవుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధ్ర, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రులుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా..కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయనం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది. తెలుగునాట ఇద్దరు సిఎంలు కూడా ఈ రెండు రంగాలను పట్టాలకెక్కించాల్సిందే. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌లతో పనిలేకుండా చేయగలగాలి. అప్పుడే రాష్ట్రాలు పురోగమిస్తాయి.

## అమల్లోకి గాజా ఒప్పందం

**- బందీలను విడిచి పెట్టిన హమాస్**

**- తొలివిడతలో ఏడుగురిని రెడ్‌క్రాస్‌కు అప్పగింత**



**న్యూఢిల్లీ,అక్టోబర్13( వెలుతురు):**

గాజా శాంతి ఒప్పందం ప్రక్రియ మొదలయ్యింది. బందీల విడుదలను ప్రారంభించాయి. ఈ క్రమంలో దాదాపు రెండేళ్లుగా హమాస్ చెరలో బందీలుగా ఉన్న వారికి సోమవారం విముక్తి లభించింది. తొలి దశలో భాగంగా ఏడుగురు బందీలను రెడ్‌క్రాస్‌కు హమాస్ అప్పగించింది. ఖాన్ యూనిస్ నుంచి వారిని తీసుకుని రెడ్‌క్రాస్ వాహనశ్రేణి ఇజ్రాయెల్‌కు బయల్దేరింది. బందీలు విడుదల వడంతో వారి కుటుంబసభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. మిగతా బందీలను కూడా హమాస్ విడిచిపెట్టనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్ ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నుంచే ఈ ఒప్పందం అమల్లోకి రాగా.. బందీల విడుదల నేడు ప్రారంభమైంది. ఒప్పందం కింద తమ వద్ద ఉన్న 48 మంది బందీలను హమాస్ విడిచిపెట్టనుంది. అయితే, ఇందులో 20 మందే సజీవంగా ఉన్నారు. వీరిని గాజాలోని మూడు ప్రాంతాల్లో హమాస్ విడుదల చేయనుంది. ఇందుకు ప్రతిగా 2వేల మందికి పైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. . ఈ విడుదల కార్యక్రమం ముగిసిన తర్వాత ట్రంప్ శాంతి ప్రణాళికలో రెండో దశపై చర్చలు ప్రారంభమవుతాయి. ఇందులో హమాస్ ఆయుధాలను త్యజించడం.. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ ప్రధాన అంశాలు. ఈ చర్చలకు అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో కీలక పాత్ర పోషించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ఇజ్రాయెల్, ఈజిప్టులలో పర్యటించనున్నారు. తొలుత ఆయన జెరూసలెంలో ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తారు. బందీల కుటుంబసభ్యులను కలుస్తారు. అక్కడి నుంచి ఈజిప్టు వెళతారు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసి 1200 మందిని హత్య చేసి, 251 మందిని హమాస్ అపహరించిన సంగతి తెలిసిందే. వారిలో కొంతమందిని గతంలో విడుదల చేసింది. కొందరిని ఇజ్రాయెల్ సైన్యం రక్షించింది. మరికొంతమంది ప్రాణాలు కోల్పోయారు. మిగిలినవారిని హమాస్ ఇప్పుడు విడిచిపెడుతోంది.

## లిక్కర్ మాఫియా డాన్ జగన్

**- మాఫియాను అరికట్టే యత్నంలో ప్రభుత్వం**

**- మంత్రి నిమ్మల రామానాయుడు**




**కర్నూలు,అక్టోబర్13( వెలుతురు):**

ఏపీలో లిక్కర్ మాఫియాను పెంచి పోషించింది జగనే అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాఫియాను అరికట్టే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు సీఎం చంద్రబాబు కఠిన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కర్నూలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సక్సెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కోరారు. ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేశామన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ పర్యటన కోసం రాయలసీమ ప్రజలు ఎదురు చూస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జీఎస్టీలో మార్పులు చేయడం వల్ల పేద మధ్య తరగతి కుటుంబానికి ఏడాదికి 20 నుంచి 40 వేలు ఆదా అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం మీద దాదాపుగా 8 వేల కోట్ల రూపాయల వరకు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. దేశ చరిత్రలో ఎప్పుడు ధరలు పెరగడం చూశాం. జీఎస్టీ సంస్కరణ వల్ల ధరలు తగ్గడం కూటమి ప్రభుత్వంలోనే చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీలో మార్పుల వల్ల మందులు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల ధరలు భారీగా తగ్గాయని ఆయన స్పష్టం చేశారు. రాయలసీమకు హంద్రీనీవా ప్రాజెక్టు గుండెకాయ అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అతి తక్కువ సమయంలో హంద్రీనీవా ప్రాజెక్ట్ కాలువను విస్తరణ పనులు చేపట్టి, చివరి ఆయకట్టుకు నీరు అందించిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మంత్రి నిమ్మల కొనియాడారు. వైసీపీ అబద్ధాలను నమ్ముకొని మనుగడ సాగిస్తోందని ఆరోపించారు. నాసిరకం మద్యానికి ఆద్యుడు మాజీ సీఎం జగనే అని విమర్శించారు. మొలకలచెరువులో నకిలీ మద్యం స్కామ్ బయట పెట్టిందే కూటమి ప్రభుత్వమని గుర్తు చేశారు. ఇందులో సొంత పార్టీ నాయకుల ప్రమేయం ఉందని వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఇది తమ చిత్తశుద్ధి అని ధీమా వ్యక్తం చేశారు. సిట్ విచారణలో అన్ని విషయాలు త్వరలోనే బయటపడతాయని ఆయన అన్నారు.

## బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కుట్ర

**- కొత్త విద్యుత్ విధానంపై బివి రాఘవులు**

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**



విద్యుత్ పంపిణీ సంస్థల ప్రమేయం లేకుండా కేంద్రం చట్టం చేయబోతుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు చెప్పారు. బొగ్గు గనులను కార్పోరేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు కార్పోరేట్ సంస్థలకు, విద్యుత్ ఉత్పత్తి సంస్థల లాభాల కోసం కేంద్రం ఇలా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై బీవీ రాఘవులు విమర్శలు గుప్పించారు. విద్యుత్ చట్ట సవరణ ప్రతిపానను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 9న చేసిందని తెలిపారు. దీనిపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని పేర్కొన్నారు. గతం కంటే దుర్మార్గమైన అంశాలు ఇందులో ఉన్నాయని ఆరోపించారు. వినియోగదారుల, కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన ఈ విధానం ద్వారా అదానీ కంపెనీలకు అధిక లాభం కలగనుందని బీవీ రాఘవులు ఆరోపించారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. దీని ద్వారా రైతాంగానికి, ఉచిత గృహ విద్యుత్ పొందుతున్న వారందరికీ తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడం.. అదానీ కంపెనీలకు మేలు చేసేందుకు చేసిందే అని విమర్శించారు. జూలై 25న సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారని గుర్తుచేశారు. మూడవ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చేస్తామని అన్నారని చెప్పారు.

## టిడిపిలో చేరిన ఎమ్మిగనూరు వైసిపి మండల నేతలు

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి

**కర్నూలు,అక్టోబర్13( వెలుతురు):**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. గోనెగొండ్ల మండలం వైసీపీ మండల ఉపాధ్యక్షులు రమణి కుమారి వైసీపీ పార్టీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అధికార కూటమి పథకాలకు ఆకర్షతులై తన అనుచరులతో కలిసి టీడీపీ పార్టీలో చేరారు. రమణి కుమారితో పాటు 200 మంది కార్యకర్తలు వైసీపీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరారు. రమణి కుమారితో పాటు మిగిలిన వారందరికీ ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాధారణ ఎన్నికల్లో కేవలం 11 సీట్లతో ఘోర పరాజయం పాలైన వైసీపీకి.. ఆ తరువాత నేతల రాజీనామాలతో జగన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న పరిస్థితి. ఇప్పటికే పలువురు ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు వైసీపీని వీడి వేరే పార్టీల్లోకి వెళ్లిపోయారు. జగన్‌కు అత్యంత సన్నిహితులు కూడా పార్టీకి గుడ్ బై చెప్పేయడంతో పార్టీ భవిష్యత్ ఏంటనే ప్రశ్నలు మొదలువుతున్నాయి. జగన్‌కు అత్యంత దగ్గరి బంధువైన బాలినేని శ్రీనివాస్ రెడ్డి, మోపిదేవి వెంకటరమణ, ఎంపీలు బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్య వీరంతా వైసీపీకి రాజీనామా చేసి వివిధ పార్టీల్లో చేరిపోయారు. అంతేకాకుండా వైఎస్ కుటుంబంతో అత్యంత నమ్మకస్తుడుగా ఉన్న విజయసాయి రెడ్డి కూడా వైసీపీకి రాజీనామా చేయడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బే అని చెప్పుకోవాలి.

## ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో చిరుత సంచారం

**తిరుపతి,అక్టోబర్13( వెలుతురు):**

నగరంలో ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. రాత్రి హాస్టల్ వద్ద విద్యార్థులకు చిరుత కన్పించడంతో సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. చిరుతను చూసిన విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ మేరకు సమాచారం అందుకున్న అధికారులు యూనివర్సిటీకి చేరుకుని చిరుత ఆనవాలను గుర్తించారు. తాజాగా ఇటీవల ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ వెనుక అటవీ శాఖ అధికారులు చిరుతను బంధించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మళ్లీ యూనివర్సిటీల్లో చిరుత సంచారంపై ఒక్కసారిగా ఆందోళన చెలరేగింది. ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో వర్సిటీల పరిసరాల్లో చిరుతలు తిరుగుతున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వాటిని బంధించేందుకు 5 బోన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ తెలిపారు. చిరుత సంచారం నేపథ్యంలో విద్యార్థులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## టూరిజం కారిడార్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్

**- ప్రధాని రాక ఏర్పాట్లను పరిశీలించి మంత్రి భరత్**

**కర్నూల్,అక్టోబర్13 ( వెలుతురు):**

టూరిజం కారిడార్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారని మంత్రి టీజీ భరత్ తెలిపారు. అనంతపూర్, కర్నూలు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. శ్రీశైలంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం కానుందని చెప్పారు. ప్రధాని మోదీ వస్తున్నందున చాలా అంచనాలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. నాటి రాజధాని కర్నూలుపై ప్రధాని మోదీకి అవగాహన ఉంటుందని చెప్పారు. కర్నూలుకి మోదీ వరం ఇస్తారని తాను ఆశిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. జిఎస్టీ తగ్గింపుతో ప్రజలకు చాలా మేలు జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి టీజీ భరత్ కోరారు. ప్రధాని మోదీ రాక కోసం కూటమి ప్రభుత్వం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాని సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కడపలో మహానాడు.. అనంతపురంలో సూపర్ సిక్స్ సభలు సక్సెస్ అయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. కర్నూలును డ్రోన్ హబ్‌గా కూటమి ప్రభుత్వం మార్చనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమాంతర అభివృద్ధి జరగాలన్నదే సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని వివరించారు. కూటమి సర్కారు అన్ని జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వీరంతా ప్రధాని రాక సందర్భంగా ఏర్పాట్లు పరిశీలించారు. 16న ప్రధాని పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు.



# ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

**- హైదరాబాద్‌కు చెందిన కన్సల్టెంట్ క్లినికల్ సైకాలజిస్ట్ డా. శ్రీపూజ సిద్ధంసెట్టి కి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూనియన్, యూరోప్ నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13, 2025:** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, లార్జెస్ట్ మాస్ సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ సెషన్ కోసం ప్రపంచ రికార్డు ను నెలకొల్పేందుకు మనోజాగృతి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని యూనిసెంట్ స్కూల్‌లో ఒక భారీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా, జూబ్లీహిల్స్‌కు చెందిన సీనియర్ మరియు డైనమిక్ సైకాలజిస్ట్ డా. శ్రీపూజ సిద్ధంసెట్టి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, ఇందులో పాల్గొన్న మనోజాగృతి వ్యవస్థాపకురాలు గీత. ఈ సందర్భంగా డా. శ్రీపూజ యొక్క కృషి/సేవలను పలువురు ప్రశంసించారు. 101 మంది కౌన్సిలర్‌లు మరియు 101 మంది సైకాలజిస్ట్‌లు పాల్గొన్న ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడం మరియు ప్రజల్లో సానుకూల ఆలోచనలను ప్రోత్సహించడం.

## నూతన ఏటిఓ జయకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఉపాధ్యాయ తపస్ బృందం



**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 13:** ఇబ్రహీంపట్నం మండలం ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్1ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగంకు సెలెక్ట్ అయి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎస్ టి ఓ కార్యాలయంలో నూతనంగా ఏటిఓగా బాధ్యతలు స్వీకరించినజయకృష్ణను ఉపాధ్యాయ తపస్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో కలిసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపి తపస్ డైరీ అందజేయడం జరిగింది ఈకార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ, ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కార్యదర్శి రాపోల్ ప్రవీణ్ కుమార్, మండల కోశాధికారి రాము తపస్ మండల బాధ్యులు రామ్మోహన్, సంజీవరాణిదకార్యాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచల యుగంధర్ గౌడ్ 23 న రాజభవన్ ముట్టడి



**బషీర్ బాగ్ వెలుతురు 12 అక్టోబర్ :** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల జాప్యంకు రాష్ట్ర గవర్నర్ కారణమని బిసి పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్ గౌడ్ ఆరోపించారు. గవర్నర్ వైఖరిని నిరసిస్తూ , ఈ నెల 23 రాజ్ భవన్ ముట్టడికి ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచాల మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్లపై తీర్మానం చేసి , ఆర్డినెన్స్ ను గవర్నర్ కు పంపిందని , కానీ దానిని ఆమోదించకుండా గవర్నర్ నిర్లక్ష్యం వహించారన్నారు గవర్నర్ ఆర్డినెన్స్ ను ఆమోదించి ఉంటే , జీవోపై స్టే ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో బిజెపి నాయకుల రెండు నాలుకల ధోరణి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. బీసీలందరు బిజెపి నాయకులు ద్వంద వైఖరిని ఎండగట్టాలని.ఛలో రాజ్ భవన్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18న బిసి జాక్ పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ కు మద్దతు ఇస్తున్నామని. ఛలో రాజ్ భవన్ కు జేఏసీ కలిసి రావాలని రాచాల కోరారు.

## విజయవంతమైన పల్స్ పోలియో కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 13:** రంగారెడ్డి జిల్లాలో సోమవారం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయింది. 12వ తేదీ నాడు ప్రారంభించిన పల్స్ పోలియో కార్యక్రమం లో మిగిలిపోయిన చిన్నారులకు 13, వ తేదీలలో పోలియో చుక్కలు ఇంటింటికి తిరిగి ఆరోగ్య మరియు ఆశా కార్యకర్తలు వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డి ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. జిల్లాలో 13, 14, 15 తేదీలలో కార్యకర్తలు మిగిలిపోయిన వారందరికీ పోలియో చుక్కలు ఇంటింటికి తిరిగి వేస్తారు. దాదాపు 100% చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితా దేవి తెలిపారు. భవన నిర్మాణ ప్రాంతంలో, ఇటుక బట్టీలు మొదలగు ఏరియాలలో తిరిగి ఆరోగ్య మరియు ఆశా కార్యకర్తలు మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు.





# ఈసి శేఖర్ గౌడ్ (మామ)కు కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పదవి ఇవ్వాలి

**- కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్**



**మంచాల వెలుతురు అక్టోబర్ 13:** మంచాల మండలం కేంద్రంలో మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్, సీనియర్ నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ మాట్లడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఈసీశేఖర్ గౌడ్ (మామ) గత 40 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ ని ఉంటూ పదవి ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజలకుసేవ చేస్తున్న గొప్ప బీసీ నాయకుడు శేఖర్ గౌడ్ మామ అన్నారు అలాంటి నాయకుడిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో కిందిస్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఒక బీసీ నేతగా మంచిపట్టున ఈసీ శేఖర్ గౌడ్ మామకే పార్టీలో గాని నామినేటెడ్ పదవుల్లో చోటు దక్కలేదు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో మన పరిస్థితి ఏమిటి అని కిందిస్థాయి నాయకులు అనుకుంటున్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో అన్యాయం జరుగుతుంది అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా ఎవ్వరూ పోటీలో ఉన్న ఈసీ శేఖర్ గౌడ్ మామ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశాడు అన్నారు అయినా ఇప్పటివరకు శేఖర్ మామకు న్యాయం జరగలేదు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కానే నాకునామినేటెడ్ పదవి కావాలి అని పార్టీ పెద్దలను కలిసి విన్నవించుకున్నాడు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది అన్నారు ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పందించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ లో ఒక బీసీ నాయకుడిగా మంచి పట్టున్న ఈసీ శేఖర్ గౌడ్ మామకు రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి పదవి ఇవ్వాలని మీడియా ద్వారా పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో ఆరుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దండు జైపాల్ రెడ్డి మంచాల మండలం వైయస్సార్ యువసేన నాయకుడు లొంగరి యాదగిరి మెగావత్ జానీ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## అంబర్పేటలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతస్థాయి నాయకుల కార్యకర్తల సమావేశం




**బషీర్ బాగ్ వెలుతురు 12 అక్టోబర్:** అంబర్పేట్ నియోజకవర్గం ధ్రువ హొటల్లో, అంబర్పేట్ నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సృజన్ అభ్యాన్ పాల్గొన్నారు కష్టపడ్డ ప్రతీ కార్యకర్త కు కాంగ్రెస్ పార్టీ లో పదవులు దక్కుతాయి అని గుజరాత్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శక్తి సింగ్ గోయల్ తెలిపారు.డిసిసి నాయకున్ని ఎన్నుకునే విధానంలో భాగంగా అంబర్పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి ఆధ్వర్యంలో అంబర్పేట్ లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అంబర్పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండువా కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో న్యాయం దక్కుతుందని, ఈ కార్యకర్తల సమావేశంలోని ప్రతి కార్యకర్త యొక్క ఉద్దేశాన్ని,అభిప్రాయాన్ని ఒక ఫామ్ ద్వారా సేకరించి ఏఐసిసికి అందించి వారి అభిప్రాయాలకు అనుగుణంగా నాయకులను ఎన్నుకుంటారని తెలిపారు. మిగతా పార్టీలో పదవులు సీల్ కవర్లలో వచ్చే విధంగా ఉండవని తెలిపారు. ముఖ్యంగా ప్రతి కార్యకర్త ఉద్దేశాన్ని విడివిడిగా ఒక్కరి అభిప్రాయాలను రికార్డ్ చేసుకొని తెలుసుకోవడం, ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తాము అన్నారు. ఇది ఒక విప్లవాత్మకమైన మార్పుగా పరిగణించవచ్చు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి



తీసుకురావడం ఖాయమని విమాల్ వ్యక్తం చేశారు. ఇందులో పాల్గొన్నవారు శక్తి సింగ్ గోయల్ (గుజరాత్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు). యశస్విని రెడ్డి (పాలకుర్తి ఎమ్మెల్యే). రోహిన్ రెడ్డి (అంబర్పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్). షంబుల ఉషశ్రీ గౌడ్, టిపిసిసి జనరల్ సెక్రెటరీ సత్యం గౌడ్, ఖైరతాబాద్ జనరల్ సెక్రెటరీ తులుపు నూరి కృష్ణ గౌడ్, మాజీ కార్పొరేటర్ గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, పి లక్ష్మణ్ యాదవ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, తదితరులు పాల్గొన్నారు

## సిపిఆర్ పై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం

**అదనపు కలెక్టర్ రెవిన్యూ జి ముకుంద రెడ్డి.**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సిపిఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ జి. ముకుంద రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సిపిఆర్ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, డిఆర్ఓ ఈ వెంకటాచారి లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి యొక్క ఆదేశాల మేరకు సిపిఆర్ పై జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ విభాగాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సిపిఆర్ పై అవగాహన కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉన్నట్లయితే అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తులు ప్రాణాలను ఎలా కాపాడగమో అనే విషయాన్ని గ్రహిస్తే , ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించుటకు వీలు కలుగుతుందని అన్నారు . అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి అవసరమైన నైపుణ్యాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. కిమ్స్ వైద్య నిపుణులు డాక్టర్ శేఖర్, మాట్లాడుతూ వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం మందగించినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స. గుండెపోటు, లేదా ఇతర అకస్మాత్తుగా సంభవించే సంఘటనల వంటి అత్యవసర పరిస్థితులలో సిపిఆర్ చేయడం చాలా ముఖ్యమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, ప్రజలకు సిపిఆర్ పద్ధతులను నేర్పడంతో



తద్వారా అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించగలరని అన్నారు. జిల్లాలో ఈ నెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్)పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటి, సిపిఓ డాక్టర్ సురేందర్, డీ ఎం ఓ రాములు, బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు ఆశన్న, కోటాజి, డీఎస్ఓ శ్రీరామ్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఏవో విజయ లక్ష్మి ,కలెక్టరేట్ సూపరిండెంట్లు, డిప్యూటీ డిఎంహెచ్వోలు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సన్ డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

**ఉన్నత విద్యా మండలి కార్యదర్శి వెంకటేశం గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ నేత లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సన్ డిగ్రీ కళాశాలను గుర్తింపు రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి వెంకటేశం గారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి కోచింగ్ సెంటర్లు కానీ ఇతర రాష్ట్రాలకు చెందిన డిగ్రీ కోర్సులను నిర్వహించరాదని నిబంధన ఉన్న దానికి విరుద్ధంగా రామ్ నగర్ లో ఉన్న సన్ డిగ్రీ కళాశాలలో నిబంధనలకు వ్యతిరేకంగా లింగయ్య విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఎంబీఏ కోర్సులు అలాగే డిప్లమా కోర్సులను నడుపుతున్నారని వెంటనే కళాశాల గుర్తింపు రద్దు చేసి, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు

## ఈ నెల 18న బంద్ ఫర్ జస్టిస్ ను విజయవంతం చేద్దాం

**అమరవీరుల స్థూపం వద్ద గోడ పత్రికను విడుదల చేసిన బీసీ నేత లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** రిజర్వేషన్లు ఎవరు ఇచ్చే బిక్ష కాదు ఇది మా హక్కు అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.బీసీలకు రావలసిన న్యాయమైన వాటాను దక్కకుండా కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకోవడం సిగ్గు చేటని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను రక్షించుకోవడమే ధ్యేయంగా బీసీ జేఏసీ పిలుపు మేరకు అక్టోబర్ 18న తెలంగాణ రాష్ట్ర బంద్ కు సంబంధించిన గోడపత్రికలను సహచర ఉద్యమ నాయకులతో కలిసి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బొంగు వెంకటేశ్, ఈడిగ శ్రీనివాస్,పానుగంటి విజయ్, గోదా రవీందర్,బండిగారి రాజు,గుంటి మహేష్,రవి, వెంకట్ యాదవ్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## కొత్త మద్యం పాలసీపై పిటిషన్


**విచారణ 2వారాలకు వాయిదా**

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):** తెలంగాణలో కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుం పెట్టారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు. లాటరీలో షాపు దక్కకపోతే రూ.3 లక్షలు అబ్కారీ శాఖకే వెళ్తాయని.. డబ్బును తిరిగిచ్చేలా ఆ శాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు. లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారీశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

## ఆర్టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాపోలు లింగస్వామి నియామకం

**సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తామని వ్యాఖ్య**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** ఆర్టీఐ (సమాచార హక్కు) చట్టంపై అవగాహన పెంచేందుకు పని చేస్తున్న 'ఆర్టీఐ రక్షక్' సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాపోలు లింగస్వామిని నియమించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్టీఐ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగస్వామి చట్టంపై మంచి అవగాహన కలిగిన వ్యక్తి. రాష్ట్రవ్యాప్తంగా కమిటీల ఏర్పాటు, సభ్యుల సమన్వయ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తారని విశ్వాసం ఉందని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాపోలు లింగస్వామి విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ



2005లో అమలులోకి వచ్చిన ఆర్టీఐ చట్టం, పారదర్శక పాలనకు పునాది. అయితే చాలచోట్ల అధికారులు ఈ చట్టాన్ని పక్కాగా అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సమాచారాన్ని ఇవ్వడంలో ఆలస్యం, తప్పుడు కారణాలతో తిరస్కరణలు వస్తున్నాయి. ఇది ప్రజలలో నిస్పృహ కలిగిస్తోందన్నారు. ప్రజలందరికీ RTI చట్టంపై సరైన అవగాహన కలిగేలా సంస్థ తరఫున కార్యకర్తలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేపడతాం. ప్రజలు తమ హక్కులపై ప్రశ్నించాలి. అధికార వ్యవస్థపై భయపడకుండా సమాచారం అడిగే స్థితికి రావాలని కోరారు. అలాగే నా నియామకానికి సహకరించిన ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్టీఐ సతీష్,ఆర్టీఐ రక్షక్ సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియచేశారు.

# రైతు లెవరూ అధైర్యం పడవద్దు.

- తడిచిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం





**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 13**

ఆకాల వర్షం కారణంగా రామన్నపేట మండలంలోని దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ గ్రామల్లో తడిచిన వరి ధాన్యాన్ని పరిశీలించి., రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఎమ్మెల్యే తో పాటు ఆర్డిఓ, ఎమ్మార్వో వివిధ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 10 సి ఎం వర్షం కారణంగా ధాన్యం తడిచింది. పరిస్థితి తెలిసిన వెంటనే అధికారులతో కలిసి పంట నష్టం పరిశీలించడం జరిగింది. తడిచిన ధాన్యాన్ని తొందరగా కొనుగోలు చేస్తాం. ఎవరూ అధైర్య పడవద్దు. మీ ధాన్యం కోనుగోలు అయే వరకు జాగ్రత్త పడండి. ప్రభుత్వ పరంగా ధాన్యం కోనుగోల్లను వేగవంతం చేస్తాము. రానున్న రోజుల్లో వర్షాలు ఇంకా ఉన్నాయి కాబట్టి, రైతులు జాగ్రత్తగా ఉండాలి..

## ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేసిన చైర్మన్,వైస్ చైర్మన్



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 13**

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో రైతులకు మార్కెట్ కమిటీ చైర్మన్ బీమ్ భుక్య నాయక్, వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి రైతులకు సోమవారం టార్పాలిన్ లు ,పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్కెట్ కు ధాన్యం తెచ్చిన ప్రతి రైతుకు టార్పాలిన్ పట్టాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీలో 1200 టార్పాన్లు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు అధికారులను సంప్రదించి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం, ఎండి జమీరుద్దీన్, గోదాసు పృథ్వీరాజ్, ఎండి అక్రమ్, కూనూరు కృష్ణ, సాల్వేర్ లింగం, రవి, రాపోలు ఉపేందర్, కొండం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు ప్రతి ఒక్కరి హక్కు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**

సంగారెడ్డి జిల్లాజహీరాబాద్ మండలంలోని అనేగుంట గ్రామంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం "ఓటు చోర్ గద్దీ చోడ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా మహిళా కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా అస్మా మాట్లాడుతూ "ప్రజాస్వామ్యంలో ఓటు ప్రతి ఒక్కరి హక్కు. ఓటు చోరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ. ప్రజల్లో చైతన్యం కలిగించడం మన బాధ్యత" అని అన్నారు. మహిళా కాంగ్రెస్ నాయకత్వంలో ఇంటింటికి తిరిగి ప్రజల సంతకాలను సేకరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరియు మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్బలంబా ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మొయినుద్దీన్, గ్రామ మహిళా నాయకులు తుల్జమ్మ, పద్మమ్మ, చున్ను బి, రాజమ్మ, రేణుక, విజయ, నర్సమ్మ, లక్ష్మి, జగదేవి, భవాని, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న నాయకత్వం పట్ల మహిళల విశ్వాసం

**జహీరాబాద్‌లో టీఆర్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్ సమక్షంలో భారీ చేరికలు...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో టీఆర్పీ పార్టీలో భారీ ఎత్తున మహిళలు చేరారు. ఈ సందర్భంగా టీఆర్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్, టి ఆర్ పి పార్టీ కార్యదర్శి రమేష్ యాదవ్, సోషల్ మీడియా ఇన్చార్జిలు శ్రీకాంత్, హనుమంతులు టీఆర్పీ పార్టీ కండువా వేసి వారికీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్ మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న నాయకత్వం పట్ల మహిళల్లో విశేషమైన విశ్వాసం నెలకొంది. మహిళలు టీఆర్పీ పార్టీ వైపు పెద్ద ఎత్తున రావడం పార్టీ బలాన్ని మరింత పెంచుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, నిర్మలమ్మ, ఈరమ్మ, శంకరమ్మ, మణెమ్మ, సుశీలమ్మ, శాంతమ్మ, మంజుల, అంజమ్మ, బ్లెస్సి, విజయమ్మ, సంజనా, మోషిన్, రాఘవులు, జయప్ప, జగనాథ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సుశ్రీత్ దరహాస్ మరణం బాధాకరం

- సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ చిలువేరు సమ్మయ్య గౌడ్
- లైన్ ఇన్స్పెక్టర్ మేడి శ్రీను ను పరామర్శించిన సమ్మయ్య గౌడ్





**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 13:**

కేసముద్రం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన లైన్ ఇన్స్పెక్టర్ మేడి శ్రీను-కవిత ల కుమారుడు సుశ్రీత్ దరహాస్(ధోని) అకాల మరణం చెందడంతో విషయం తెలిసిన వెంటనే సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ శ్రీను కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి సుశ్రీత్ ధరహాస్ చిత్ర పటం వద్ద నివాళులర్పించి అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారికి మనోధైర్యాన్ని కల్పించారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కంటిపూడి అరుణ్ కుమార్ మాదిగ, కాలనీవాసులు అందే గురువయ్య,మేడి సుధాకర్,సారంపల్లి పెద్ద వెంకట్ రెడ్డి,భానోత్ కిషన్ నాయక్,శీలం నవీన్,యూత్ కమిటీ సభ్యులు అందే అనిల్, అందే సునీల్,మట్టే రాఘవ,మేడి నవీన్, మేడి మోహన్,మట్టే ఉదయ్,అందే చింటూ, అందే నవీన్,దడిపల్లి యాకూబు,కంటిపూడి కవిత,గడి పెల్లి ఉమా, అందే లక్ష్మి,మట్టే పద్మ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా భవాని ప్రత్యేక పూజల పట్టు వస్త్రాలు కలుశాన్ని సమ్మి గౌడ్‌కి అందజేసిన అన్నదాత యూత్ అసోసియేషన్ కమిటీ






**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 13:**

కేసముద్రం మండలం తాళ్ల పూసపల్లి గ్రామం లో అన్నదాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా భవాని మాతా దేవి ప్రత్యేక పూజల్లో తొమ్మిది రోజులపాటు ఉన్నటువంటి కలుశాన్ని,ప్రతిరోజు అమ్మవారి అలంకరణలో భాగంగా ఉన్న పట్టు వస్త్రాలను తాళ్లపూస పల్లి అన్నదాత యూత్ అసోసియేషన్ కమిటీ యువత సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ కి అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.... ఆ దుర్గామాత తల్లి పూజలతో వర్ధిల్లిన పట్టు వస్త్రాలు,కలుశం అన్నదాత యూత్ అసోసియేషన్ కమిటీకి, నాకు అందేలా చేసిన దుర్గామాతకు, అసోసియేషన్ కమిటీ సభ్యులందరికీ నా తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కమలాకర్,రాజు, మధుకర్,నరేందర్, విక్రమ్,శివరామకృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో మంచినీటి బావిలోకి వరద నీరు, మురికి మయమైన తాగునీరు.



**తిరుమలగిరి (సాగర్ ) వెలుతురు న్యూస్ అక్టోబర్ 13:**



తిరుమలగిరి గ్రామానికి జీవనాధారమైన మంచినీళ్ళ భావి సుమారు 4000 మందికి కరెంటు మోటార్ల ద్వారా ప్రతి ఇంటికి మంచినీటిని సరఫరా చేస్తుంది గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీరు బావిలోనికి వచ్చి చేరి మంచినీరు కాస్త మురికిమయంగా మారినవి గ్రామానికి ముఖ్య ఆధారమైన ఆ బావి నీళ్లను చూసి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు . ఇప్పటికే గ్రామంలో వృద్ధులు, పిల్లలు, టైఫాయిడ్ మలేరియా డెంగ్యూ వంటి విష జ్వరాలతో బాధపడుతుండగా ఈ నీటిని చూసి మరింత భయపడుతున్నారు. ఉదయం కాలకృత్యాలకువాడుకున్నందుకు కూడా వీలులేనంతగా మురికిమాయంగా వస్తున్నాయని ప్రజల ఆందోళన చెందుతున్నారు

# నవంబర్,28, 29, 30 తేదీలలో సూర్యాపేటలో కల్లుగీత కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలు.

- 110 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు
- గీత కార్మికుల హక్కులకై ఉద్యమాలను ఉధృతం చేస్తాం.
- మేకపోతుల వెంకటరమణ, కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు.

**సూర్యాపేట వెలుతురు అక్టోబర్ 13:**



కల్లుగీత కార్మిక సంఘం 4 వ రాష్ట్ర మహాసభలు పోరాటాల పురిటి గడ్డ సూర్యాపేట పట్టణంలో నవంబర్ 28, 29, 30 తేదీలలో నిర్వహిస్తామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ ప్రకటించారు. మొదటిరోజు వేలాదిమంది గీత కార్మికులతో ప్రదర్శన, బహిరంగ సభ ,2 రోజులు ప్రతినిధుల సభ నిర్వహిస్తామని దీనికి రాష్ట్ర వ్యాప్తంగా హాజరవుతారని వీటిని జయప్రదం చేయాలని గీత కార్మికులకు పిలుపునిచ్చారు. ఈరోజు అంతటి విజయ్ ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షులు ఎల్గూరి గోవింద్ అధ్యక్షతన జరిగే జరిగిన సన్నాహక సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వయం పోషకంగా బతుకుతున్న లక్షలాదిమంది గీత కార్మికుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ప్రణాళిక రూపొందించలేదని రమణ ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత సొసైటీలను బలోపేతం చేయాలని అన్నారు. వృత్తిలో ఉపాధి మెరుగుపడాలంటే చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, మార్కెట్ సౌకర్యం కల్పించాలని అందుకు తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. .వీటి అమలుకు బలమైన ఉద్యమాలు నిర్మించేందుకు మహాసభలో రూపకల్పన చేస్తామన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. అధికారులకు, మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఫలితం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాద నివారణకు వృత్తి చేసే వారందరికీ జాప్యం లేకుండా కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని అన్నారు. ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా 12 కోట్ల 60 లక్షలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభలలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి ఆర్థిక, సామాజిక, సంస్కృతిక రంగాలలో అభివృద్ధి సాధించేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, గౌని వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండం కరుణాకర్, యమగాని వెంకన్న, అబ్బ గాని బిక్షం ,తుమ్మల సైదయ్య, ఉయ్యాల నగేష్, గుణగంటి కృష్ణ బోడప్పట్ల జయమ్మ, బత్తుల జనార్ధన్ జేరిపోతుల కృష్ణ నోముల వెంకన్న తండా రమేష్ బట్టిపల్లి నాగమల్లయ్య బుర్ర యల్ల గౌడ్, పొడిసేటి సైదులు, ఆకుల రమేష్, అనంతల చంద్రయ్య, కుక్కడపు రామకృష్ణ, మండవ సైదులు, దోనేటి పిచ్చయ్య, బెల్లంకొండ ఇస్తారి, కాసాని వీరస్వామి, గుండగాని శ్రీనివాస్, నకరికంటి శ్రీను, కప్పల సత్యనారాయణ, కారింగుల సైదమ్మ అబ్బగాని కాశయ్య మద్దెల నరసయ్య మొగుళ్ళ మహేష్ రాచకొండ నాగరాజు మహిళా సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ రాజేష్ రాపర్తి శ్రీనివాస్ మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులు సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ ఆరాధన్ రెడ్డి, సారిన్ జాన్ జన్మదిన వేడుకలు

**సిటీ సెంటర్ ఆసుపత్రిలో కేక్ కట్‌తో ఉత్సాహంగా సంబరాలు**

**జహీరాబాద్, వెలుతురు, అక్టోబర్ 13:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని సిటీ సెంటర్ ఆసుపత్రి ప్రధాన డాక్టర్ ఆరాధన్ రెడ్డి మరియు ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సారిన్ జాన్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ ఇంచార్జ్, ఆసుపత్రి డైరెక్టర్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఆసుపత్రి డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డితో కలిసి ఇరు డాక్టర్లకు శాలువా కప్పి, బొకేతో సన్మానం చేశారు.





అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఇంచార్జ్, ఆసుపత్రి డైరెక్టర్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సేవలో తాము చేసే మంచి కార్యాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. సమాజం కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచినప్పుడే నిజమైన పేరు, గౌరవం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో డా. ఆరాధన్ రెడ్డి, డా. సారిన్ జాన్, డైరెక్టర్లు గంకటి శు క్లవర్ధన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, పల్లవి స్కూల్ డైరెక్టర్ గంకటి శ్రీధర్ రెడ్డి, మొయిజ్ లష్కరి, మొహమ్మద్ అష్రాఫ్, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జన్మదిన ఆహ్వానం

- రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మొహమ్మద్ జమీరోద్దీన్

**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 13**

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ జన్మదిన సందర్భంగా ఈనెల 14 మంగళవారం రోజున ఉదయం 10 గంటలకు రామన్నపేట మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశ్వర స్వామి దేవాలయంలో పూజ నిర్వహించి, అనంతరం అక్కడి నుండి ర్యాలీగా చిట్యాల రోడ్డులోని గరిక సత్యనారాయణ ఫంక్షన్ హాల్ లో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నందున, ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఫిషరీస్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ రానున్నారు. కావున కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, ఆయన అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి జన్మదిన వేడుకలను జయప్రదం చేయగలరు కోరుచున్నాం.

# ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆధ్యాత్మిక ధార్మిక ప్రచార కార్యక్రమాలు...



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 13:**



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆధ్యాత్మిక ధార్మిక ప్రచార కార్యక్రమంలో భాగంగా అశోక్ నగర్ మాజీ కార్పొరేటర్ బ్రహ్మశ్రీ వెంకటరమణ ఉమారాణి స్వగృహమున శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి"పూజ-సత్సంగం-భజన" కార్యక్రమంను ఘనంగా నిర్వహించడం జరిగినది. విశ్వబ్రాహ్మణ వేద పండితులు బ్ర!!శ్రీ!! యాష్వాడ రాకేష్ శర్మ పూజా కార్యక్రమం నిర్వహించి, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి రచించిన కాళికాంబ సప్తశతకం గూర్చి బోధించారు. గురుస్వాములు బ్రహ్మశ్రీ సిరికొండ సత్యనారాయణ కాలజ్ఞాన ప్రవచనములు తెలియజేశారు. ముఖ్యఅతిథి నర్సింగరావు గురు స్వామి మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారు సబ్బండ జాతుల గురువుగా అభివర్ణిస్తూ, వారి కాలజ్ఞానాన్ని , స్వామివారి రచించిన రచనలను, తత్వ బోధనలను వివరించారు. ప్రచార సమితి సభ్యులు , స్వామివారి భక్తులు స్వామివారి చూర్ణిక చదువుతూ,, భజనలు చేయగా, స్వామివారికి నైవేద్యం నివేదన చేసిన తదనంతరం మహిళా మణులు కర్పూర మంగళహారతులు స్వామి వారికి అందించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఇట్టి కార్యక్రమంలో శ్రీరామోజు రవీంద్ర చారి, అనసూరి రమేష్, గజ్జేల హరిహరాచార్యులు, తిప్పారం శ్రీనివాస్, కదుకూరు రమేష్, శ్రీమంతుల బ్రహ్మయ్య, శ్రీమంతుల సదాశ్రీ, దేన్నానోజ బ్రహ్మచారి, గొట్టిముక్కల మహేష్, గోపి కట్ట పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# వీధి బాలుర గృహంలో దారుణం

**- చిన్నిపిల్లలపై పర్యవేక్షకుడి లైంగికదాడి**

**- పోలీసుల అదుపులో నేరస్థుడు**

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**

సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రభుత్వ వీధి బాలుర గృహంలో ఆరుగురు బాలురపై పర్యవేక్షకుడు రెహమాన్ లైంగిక దాడి చేశాడు. బాధితుల్లోని ఓ బాలుడి తల్లి సైదాబాద్ పోలీసులను ఆశ్రయించగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దసరా పండగకి ఇంటికి వచ్చి తిరిగి జువెనైల్ హోంకు వెళ్లనని ఓ చిన్నారి తల్లి వద్ద భోరున విలపించాడు. ఆరా తీయడంతో.. విషయం తెలిసింది. జువెనైల్ హోంలో సంరక్షకుడే అభంశుభం తెలియని బాలురపై అసహజరీతిలో తరచూ లైంగికదాడికి పాల్పడ్డాడు. మొదట బాధితుడు ఒక్కడే అనుకున్నారు.. పోలీసులు కూపీ లాగితే మరో అయిదుగురిపైనా లైంగిక దాడి చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు వైద్యుల పరీక్షల్లో బాలుడిపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధరణ అయింది. మిగిలిన ఐదుగురు మైనర్లకు కూడా పోలీసులు వైద్య పరీక్షలు చేయించనున్నారు. ప్రస్తుతం నిందితుడు రెహమాన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

# అకాల వర్షంతో 6వేల కోళ్లు మృతి

**యాదాద్రి,అక్టోబర్13( వెలుతురు):**

యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. పెద్దకొండూరు గ్రామ పంచాయతీ నక్కలగూడెంలోని కోళ్లఫారంలోకి భారీగా వర్షపునీరు చేరింది. దీంతో సుమారు 6వేల కోళ్లు నీటమునిగి మృతిచెందినట్లు కోళ్లఫారం యజమాని తెలిపారు. మరోవైపు మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున వరి, పత్తి పంటలు నీటమునగడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయామని అన్నారు.

## పెద్ద అంబర్‌పేటలో దొంగల బీభత్సం

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**

హయత్‌నగర్ పీఎస్ పరిధి పెద్ద అంబర్‌పేటలో దొంగలు బీభత్సం సృష్టించారు. సదాశివ గేటెడ్ కమ్యూనిటీలో రెండిళ్లలో చోరీ చేశారు. సెంట్రల్ లాక్ ఉన్న డోర్లు బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారు. 5 కేజీల వెండి, 35 గ్రాముల బంగారం, రూ.60వేల నగదు, విలువైన చీరలను అపహరించారు. చోరీకి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఈ ప్రాంత వాసుల్లో భయం నెలకొంది.

# సాంస్కృతిక యుద్ధ స్వరం సుద్దాల జానకమ్మ హనుమంతు

## 13 న సుద్దాల పురస్కారాల ప్రదానోత్సవం

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**

సుద్దాల జానకమ్మ హనుమంతు సాహితి జానపద నృత్య పురస్కారాల ప్రధానోత్సవం ఈ నెల 13న సాయంత్రం 6 గంటలకు సుందరయ్య కళా నిలయం బాగు లింగంపల్లి హైదరాబాదులో అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద మాట్లాడుతూ దేశం ఏదైతేనేం తల్లిదండ్రుల ప్రేమ ఒక్కటే ఆశ్రయమేదైతేనేమి అమ్మ ప్రేమ ఒక్కటే మన తల్లుల పిలుపులన్నీ ఒక్కటే అలాంటి అమ్మ సుద్దాల జానకమ్మ హనుమంతుల పురస్కారం 14 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా నిర్వహించడం ఒక గొప్ప కార్యంగా భావిస్తున్నాను ఉయ్యాలలూపిన చేతులు ఉద్యమాలను నడిపిన కుటుంబంగా కొనియాడారు సుద్దాల జానకమ్మ హనుమంతు వారు నిష్క్రమించడం కాదు వాళ్ల ఆశయాలను ఆవిష్కరించడం నేటి వారసులను పరిచయం చేయడం వల్ల మరణించలేదు వాళ్ల పాటలతో మళ్లీ జన్మించారు వాళ్ళ త్యాగాలను వడిసి నేటితరానికి అందజేస్తున్న సుద్దాల అశోక్ తేజకు అభినందనలు తెలియజేశారు పురస్కార గ్రహీతలు ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఓల్గా గారికి ప్రముఖ జానపద గాయని మధుప్రియ ప్రముఖ నర్తకి మని లాలినిధికి పురస్కారాలు అందజేసినారు ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎస్ రఘు ప్రొఫెసర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం సుద్దాల సుధాకర్ తేజ తదితరులు పాల్గొని ప్రసంగించారు నాట్య ప్రదర్శనలు నృత్య రూపకాలు చైతన్య కార్యక్రమాలు అలరించాయి ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ గారు మాట్లాడుతూ తెలంగాణ నేల సాలు మీద పాటలతో విత్తనమైన నా



తల్లిదండ్రులు జానకమ్మ హనుమంతుడు నా తండ్రి పాటకు కుడి ఎడమైన మామ పేరు మీద అమ్మలకు సాహితీ జానపద నృత్య పురస్కారాన్ని అందజేస్తున్నానని అన్నారు. మా తల్లిదండ్రులు పోరు పాటలకు తేనె తీపి నది పల్లె పల్లెన ఉద్యమమై అరుణ పతాకాలను ఎగరవేసిన ప్రజాస్వరము జనంతో వారి పాట జనమంతా ఆయన పాట జగమంతా పాట జీవితమంతా పోరుబాటే అడుగడుగునా నాన్నది ముల్లబాటే నా పాటలు ప్రాణమైన నా తల్లిదండ్రులకు ప్రణామంగా 14 సంవత్సరాలుగా పాటలకు ఆటలకు పురస్కారాల ప్రధానోత్సవం నా ప్రాణమున్నంత వరకు ప్రతిజ్ఞ లాగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం పల్లె పల్లెనా సుద్దాల ఆశయాలను ముందుకు తీసుకపోతాను అని అన్నారు సినీ గాయని మధుప్రియ మాట్లాడుతూ సుద్దాల హనుమంతు పాటలు యుద్ధ ఉద్యమ ఆత్మగౌరవ గీతాలై ఉద్యమాలకు సంబంధం చేస్తూనే ఉన్నాయి. వారి పాటలు ప్రజలకు పోరాట సోయి పెంచిని గరీబోడు గాయపడితే గండ దీపమై బయలెల్లి మట్టి మనుషులను తట్టి లేపి యుద్ధానికి సిద్ధం చేసిన సుద్దాల కుటుంబము బడుగు బతుకులలో యుద్ధాల సుద్దాలగా ప్రవాస ప్రవాహ మవనవాస గానం సుద్దాల హనుమంతు గానం అని అన్నారు ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఓల్గా మాట్లాడుతూ హనుమంతు పాటలు ఒక అగ్నిపర్వతం సాంస్కృతిక యుద్ధ స్వరం ప్రజల మస్తిష్కాలను విప్లవీకరించి వారిని విప్లవ భావాల సాయుధుల్ని చేసిన ప్రత్యేకత సుద్దాల జానకమ్మ హనుమంతులది అని అన్నారు విప్లవ భావాలు పట్టని వాళ్ళను సైతం సుద్దాల హనుమంతు గొంతుతో పాడితే మత్తడి దుంకినట్లు ఎగిసిపడే తెలంగాణ ఉద్యమ పాటల్ని చూసి సుద్దాల అశోక్ తేజ పెరిగినారు సుద్దాల యుద్ధ కవిని




బతికించుకోవాలిగా.. అందుకే ఈ ప్రతిభా పురస్కారాలు సుద్దాల గానం నిరంతర ప్రవాహం సుద్దాల పాటతో ప్రయాణం సాహితీ జానపద నృత్య ప్రతిభా పురస్కార సభ విజయవంతంగా జరిగింది ఈ కార్యక్రమంలో సుద్దాల సుధాకర్ తేజ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు భూపతి వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు సుద్దాల నిర్మల సుద్దాల భారతి, తదితరులు పాల్గొన్నారు 6 గంటల నుండి 7 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి

## 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కై జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, విశారదన్ మహారాజ్, బాల్ రాజ్ గౌడ్ నేతృత్వంలో 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సాధన సమితి ఏర్పాటు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**



42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కై జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, విశారదన్ మహారాజ్, బాల్ రాజ్ గౌడ్ నేతృత్వంలో "42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సాధన సమితి ఏర్పాటు, తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సోమవారం 42% బీసీ రిజర్వేషన్లు - ఉద్యమ కార్యాచరణ అంశంపై విలేకరుల సమావేశం జరిగింది మేధావులు, అడ్వకేట్లు, బీసీ సంఘాలు, కుల సంఘాల నేతలతో సమావేశం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కేవలం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ తో మాత్రమే బీసీ రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందని తాము మొదట్నుంచి చెబుతున్నామని వక్తలు ముక్తకంఠంతో చెప్పారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అతి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా య రథయాత్ర చేసి ప్రజలను చైతన్యం చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ,బిజెపి బిఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని వారు ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల కోసం కలిసి వచ్చే బీసీ, కుల సంఘాల నేతలతో ప్రత్యేకంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన




సమితి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని జస్టిస్ ఈశ్వరయ్య హెచ్చరించారు. రాజ్యాంగపరమైన రక్షణలు తీసుకోకుండా జీవోలతో రాజకీయ పార్టీలు డ్రామాలు చేస్తున్నాయని ఈశ్వరయ్య ధ్వజమెత్తరు. దేశంలోనే చాలా రాష్ట్రాలలో జీవోలతో రిజర్వేషన్లు తెచ్చే ప్రయత్నం జరిగిందని, వాటిని కోర్టులు కొట్టివేశాయని ఈ అనుభవముతోనే 9వ షెడ్యూల్లో చేర్చడం ఒకటే పరిష్కారమని, జీవోలతో ఎన్నికలు నిర్వహిస్తే వాటికి చట్టబద్ధత ఉండదని, కోర్టులు కొట్టివేస్తాయని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ టీ. చిరంజీవులు పేర్కొన్నారు. మండల్ కమిషన్ నుంచి నేటి వరకు బిజెపి బీసీ రిజర్వేషన్లకు దారుణంగా అడ్డుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తప్పనిసరిగా స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను వర్గీకరించాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ల సాధనకై అతిపెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని బీసీ ,ఎస్సీ, ఎస్టీ ,జేఏసీ చైర్మన్ విశారద మహారాజ్ అన్నారు. ఈ సందర్భంగా బీసీల రిజర్వేషన్ల కోసం కొట్లాడే అందరితో సమన్వయంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఇతర రాజకీయ పార్టీలతో అంట కాగుతూ బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి నాయకత్వం వహించే వారిని తాము ఎలా నమ్ముతామని తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్ అన్నారు. త్వరలో ఇందిరా పార్క్ దగ్గర పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించడంతోపాటు, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారీగా రథయాత్ర నిర్వహించించడమే కాకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు , రాచాల యుగేందర్ గౌడ్,మేకపోతుల నరేందర్ గౌడ్,ఎస్.దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యులు చామకూర రాజు, కెవి గౌడ్, ఎర్రమాద వెంకన్న నేత, కిరణ్ కుమార్, అవ్వారు వేణు, బైరు శేఖర్,లింగేష్ యాదవ్, బీసీ లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నం దేవరాజ్ గౌడ్, సింగం నాగేశ్వర్ గౌడ్,బత్తిని కీర్తిలతా, బొల్లంపల్లి ఆంజనేయులు, బొమ్మ రఘురాం నేత, కొండల్ గౌడ్, ఘోరా శ్యామ్, దాసు సురేష్, డాక్టర్ విజయకుమార్, అడ్వకేట్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## చిత్తారమ్మ డబుల్ బెడ్ రూమ్ సంక్షేమం సంఘం చెల్లదు...

**- అన్నీ అక్రమాలే...అవకతవకలే..**

**- జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ అధికారి వెంకట్ రెడ్డి..**

**కూకట్ పల్లి అక్టోబర్ 13 వెలుతురు:**

చిత్తారమ్మ డబుల్ బెడ్ రూమ్ సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంఘం చెల్లదని, ఇందులో జరిగిన అవకతవకల్ని బయటపెడతానని, ప్రతీ పైసాకు లెక్క చెప్పాల్సిన అవసరం ఉందని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టరీత్య చర్యలకు పోలీసుకు సిఫారసు చేస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ జిల్లా అధికారి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన బాలానగర్ డివిజన్ లోని చిత్తారమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయానికి అధికారుల బృందంతో కలిసి డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ లబ్ధిదారుడిని అందరు సమక్షంలోనే విధిగా అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 మందికి చిత్తారమ్మ బస్తీలో అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వడం జరిగిందని, లబ్ధిదారులంతా మహిళలే అన్నారు. కానీ ఇక్కడ ఏర్పడిన సంఘంలో లబ్ధిదారుల భర్తలు సభ్యులుగా ఉండటం ఎంతో ఆశ్చర్యానికి గురయ్యానని, ఇది సరికాదని స్పష్టం చేశారు. ఇక్కడి విషయాలను అన్నింటిని స్పష్టంగా పరిశీలించడం జరిగిందని, ఇది చట్ట విరుద్ధమని



అన్నారు. దీపావళి పండగ తర్వాత కొత్తగా కో ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ చిత్తారమ్మ డబుల్ బెడ్ రూం ఇళ్లలో అనేక సమస్యలు ఉన్నాయని ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. తాజ్ బేకరి ఏర్పాటు చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సభ్యులు ఎవరికీ తెలియకుండా దొంగ చాటుగా తీర్మానం చేసి ఏర్పాటు చేశారని తీవ్రంగా విమర్శించారు. తాజ్ బేకరిని అమ్ముకున్నారని ఆరోపించారు. హైడ్రా అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి తాజ్ బేకరిని తొలగించాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు సముదాయంలో షట్టర్లు కేటాయింపు, లిఫ్ట్ మెయింటైనెన్స్ పట్ల జరిగిన ఒప్పందాలను బయట పెట్టాలని కోరారు. 2020 నుండి ఇప్పటి వరకు ఎన్నికలు జరగలేదని అన్నారు. సెల్లార్ లో విపరీతమైన దోమలు, పంది కొక్కులు తాండవం చేస్తూ వాహనాల వైర్లను కొరికి వేస్తున్నాయని పేర్కొన్నారు. తాజ్ బేకరికి ఇచ్చిన బాత్ రూమ్లను అపరిశుభ్రంగా ఉంచడం స్థానికంగా రోగాలకు దారి తీస్తున్నాయని అక్కడి స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## అడవిలో సగంకాలిన మహిళ మృతదేహం

**- దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**నాగర్‌కర్నూల్,అక్టోబర్13( వెలుతురు):**

జిల్లాలోని పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట గ్రామం సమీపంలోని అటవీప్రాంతంలో సగం కాలిన ఒక మహిళ మృతదేహం గుర్తించారు. అడవిలో దుర్వాసన వస్తోందని గుర్తించిన గ్రామస్థులు దగ్గరగా వెళ్లి చూసే సరికి ఈ దృశ్యం కనబడింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా, పెంట్లవెల్లి పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహం తీవ్రంగా కాలిపోవడంతో మహిళ ఎవరో గుర్తించడం సాధ్యంకాలేదు. శరీరం పక్కన ఎలాంటి వస్తువులు లభించకపోవడంతో పోలీసులు మృతురాలి గుర్తింపు కోసం సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారాన్ని పంపించారు. అలాగే మిస్సింగ్ కేసుల రికార్డులను కూడా పరిశీలిస్తున్నారు. మహిళ హత్యకు గురై ఉంటుందా, లేక ఆత్మహత్య చేసుకుందా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఫోరెన్సిక్ బృందం పరిశీలించి ఆధారాలను సేకరిస్తోంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో మంచాలకట్ట పరిసర ప్రాంతాల్లో భయాందోళన నెలకొంది. అడవుల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

# "ఎపిటోమ్" సంస్థపై హెచ్ఆర్సీ లో ఫిర్యాదు చేసిన బాధితులు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13:**

పేదల భూములు మింగేస్తున్న ఎపిటోమ్ సంస్థపై బాధితులు, రైతులు పోరుబాట పట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవులమ్మనగారం, తంగడపల్లి గ్రామాల్లో "ఎపిటోమ్ ఇంటిగ్రేటెడ్ సిటీ" పేరిట జరుగుతున్న అక్రమ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలపై నిరసగ గళం విప్పారు. ఈ మేరకు సోమవారం నాంపల్లి లోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను బాధితులు ఆశ్రయించి రైతులకు జరిగి అన్యాయం పైన లిఖితపూర్వకంగా ఆధారాలతో పత్రాలను హెచ్ఆర్సీ కార్యాలయంలో అందజేశారు. తమకు న్యాయం చేయాలంటూ హెచ్ఆర్సీ చైర్మన్ షమీం అక్తర్ కు బాధితులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హెచ్ఆర్సీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎపిటోమ్ సంస్థకు కేవలం 367 ఎకరాలకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ దానిని 1200 ఎకరాలకు విస్తరించి చట్టవిరుద్ధంగా భూములను ఆక్రమించిందని వారు ఆరోపించారు. పొలాలకు వెళ్లే నక్క బాటలు, కుంటలు, చెరువులు కూడా ఆక్రమించి ప్లాట్లు



విక్రయిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెందిన పేదల ఉపాధి భూములు, నిషేధిత భూములను కూడా ఈ వెంచర్‌లో కలిపేశారన్నారు. అనుమతులు లేకుండానే రోజుల్లోనే వందల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేశారని, తాము అభ్యంతరం వ్యక్తం చేస్తే.. రాజకీయ పెద్దల మద్దతు ఉందంటూ భయపెట్టి దాడులకు పాల్పడుతోందని తమ ఆవేదనను వెళ్లగక్కారు. అంతేకాదు రిజిస్ట్రేషన్ కోసం చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా.. రొటేషన్ బిజినెస్ చేస్తోందని వారు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2021లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు 2024లో పూర్తవుతుందని చెప్పినా, ఇప్పటి వరకు ఏ అభివృద్ధి పనులు జరగలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులకు ఈ అక్రమాలు గురించి తెలిసినా.. ఏ చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేవులమ్మనగారం, తంగడపల్లి గ్రామాల్లో ఎపిటోమ్ వెంచర్స్ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై దాడులు, బెదిరింపులపై రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ, నిషేధిత భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. బాధిత వినియోగదారులకు న్యాయం జరిగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ అక్రమాలకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# జహీరాబాద్‌లో ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలకు కూల్చివేతలు

**- అనధికార, ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేసిన యెడల కఠిన చర్యలు తీసుకుంటాం...**

**- హెచ్చరించిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**

ప్రభుత్వ భూముల్లో అక్రమ ఇండ్లు, షెడ్లు నిర్మిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని, ప్రభుత్వ భూముల్లో ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసిన అధికార యంత్రాంగం సర్వే చేసి దానిని తిరిగి వశం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. సోమవారం నాడు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ వార్డులో గల సర్వే నెంబర్ 111 లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. రంజోల్ గ్రామంలోని సర్వే నంబర్ 111 వద్ద నిర్మించిన పది అక్రమ నిర్మాణాలను మున్సిపల్ మరియు రెవెన్యూ శాఖల సంయుక్త బృందం కూల్చివేసింది. పోలీసుల భద్రతా ఏర్పాట్ల మధ్య జెసిబి యంత్రాల సాయంతో ఇళ్లు, షెడ్లు, ఇతర నిర్మాణాలు నేలమట్టం చేశారు. కూల్చివేత చర్యల సమయంలో



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని, ఎవరూ చట్టాన్ని అతిక్రమించవద్దని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ప్రభుత్వ పనుల నిమిత్తమే వినియోగించే విధంగా చర్యలు చేపడతామని, అనధికార, ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేసిన యెడల కఠిన చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగానే ఇక్కడ నిర్మించిన 10 షెడ్లలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్త సర్వేలో గుర్తించి జెసిబీ యంత్రాల ద్వారా నేలమట్టం చెయ్యడం జరిగిందని, నెలమట్టం చేసిన స్థలంలో ప్రభుత్వ భూమి అనే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

# న్యాయ వ్యవహారాల్లోనూ సాంకేతికత

**- అందిపుచ్చుకుని ముందుకు సాగాలి**

**- లాఫెస్ట్ కార్యాక్రమం ప్రారంభించిన మంత్రి వివేక్**

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**



న్యాయరంగంలో సాంకేతికత విపరీతంగా పెరిగిందని.. ఇప్పుడు టెక్నాలజీ వాడి న్యాయపరమైన పత్రాలు రాయొచ్చు, అనాలిసిస్ చేయొచ్చని మంత్రి వివేక్ అన్నారు. టెక్నాలజీ తో పాటు హ్యూమానిటీ ఉండాలని.. ఎందుకంటే హ్యూమానిటీ లేకపోతే దీర్ఘకాలం ఏ రంగంలో నిలబడలేమని అన్నారు. బాగ్ లింగంపల్లిలోని అంబేద్కర్ లా కాలేజీలో విద్వత 2025 లా ఫెస్ట్ కి ముఖ్య అతిధిగా మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. అక్టోబర్ 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న లా ఫెస్టివల్‌ను మంత్రి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 1990లలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు 2020లలో పూర్తిగా మారిపోయాయని... న్యాయరంగంలో కూడా న్యాయమూర్తుల దృక్పథం, న్యాయవాదుల వైఖరి మారుతోందని అన్నారు. మనం కూడా వాటికి అనుగుణంగా మారాలని అన్నారు. నేను స్వయంగా ఒక ఇండస్ట్రియలిస్ట్ ని.. 5 లక్షల పెట్టుబడితో ప్రారంభించి, 2 వేల కోట్ల వ్యాపారం వరకు తీసుకువచ్చానని అన్నారు. ఇది సాధ్యమైంది కేవలం కష్టపడి, నిజాయితీగా పనిచేయడం వల్లే అని అన్నారు మంత్రి వివేక్. నేను మెడిసిన్ డాక్టర్, ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియదు.. అయినా కానీ కామన్ సెన్స్, కష్టపడి పనిచేయాలనే ఆసక్తి వల్లే సాధించ గలిగానని అన్నారు.. ఏ రంగంలోనైనా విజయం కావాలంటే కష్టపడాలని, నిజాయితీగా ఉండాలని, మనుషుల సమస్యలు అర్థం చేసుకోవాలని అన్నారు. అంబేద్కర్ కళాశాల ఈ సారి దేశవ్యాప్తంగా విద్యార్థులను ఆహ్వానిస్తూ ఇలాంటి ఉత్సవం నిర్వహించడం గొప్ప విషయమని... కాకా కేవలం 10వ తరగతి చదివినవారు అయినా, పేదలకు విద్య అందించాలి, అవకాశాలు కల్పించాలి అన్న దృక్పథంతో ఉన్నారని అన్నారు. ఆ దృష్టిని ముందుకు తీసుకెళ్లడం మన బాధ్యత అని అన్నారు మంత్రి వివేక్.ఈ కళాశాల 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం ఒక గొప్ప ఆలోచన అని... ఇది పోటీని, కృషిని పెంచుతుందని అన్నారు మంత్రి వివేక్. మా కుటుంబం కార్మిక ఉద్యమం నేపథ్యంతో ఉందని... నేను కార్మిక శాఖ మంత్రిగా కొత్త చట్టాలపై పనిచేశానని... ముఖ్యంగా గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన రక్షణ ఉండేలా ఒక చట్టం రాబోతోందని అన్నారు. అలాగే పదేళ్లుగా పెరగని కనీస వేతనాల వ్యవస్థను సరిచేయడం కూడా జరుగుతోందని అన్నారు.

# జూబ్లీహిల్స్‌లో 200 నామినేషన్లు వేస్తున్నాం

**- తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటన**

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం జిల్లాల వారీగా 200 మంది మాలలు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. రాష్ట్రంలో ఆరు నెలలుగా జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎస్సీల్లోని 58 కులాలకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొంది. కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ ఛైర్మన్ మందాల భాస్కర్, అధ్యక్షుడు చెరుకు రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 'ఎంపెరికల్ డేటా తీసుకుని, అన్ని వర్గాలతో చర్చించి వర్గీకరణ చేస్తామన్నారు. అవేవీ చేయకుండానే వర్గీకరణ చేసి 58 కులాల గొంతు కోశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం అని జేఏసీ నేతలు తెలిపారు.

# జూబ్లీహిల్స్‌లో మొదలైన నామినేషన్ల సందడి

**- తొలిరోజు పదిమంది నామినేషన్లు దాఖలు**




**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నిక సందడి మొదలైంది. సోమవారం నామినేషన్లకు తొలిరోజు కావడంతో ఔత్సాహిక అభ్యర్థులు నామినేషన్లు వేశారు. తొలిరోజు నామినేషన్ల పక్రియ పూర్తయ్యింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ వేసిన వారిలో ఇద్దరు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు ఉండగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. తెలంగాణా పునర్నిర్మాణ సమితి తరపున పూస శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయగా.. నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్ తో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. షెడ్యూల్ ప్రకారం టర్నింగ్ అధికారి సోమవారం నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. షేక్ పేట్ ఎమ్మార్వో ఆఫీసులో నామినేషన్ల స్వీకరణ పక్రియ కూడా ప్రారంభం అయ్యింది. అక్టోబర్ 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 22వ తేదీన దాఖలైన నామినేషన్ పరిశీలన ఉంటుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయిన రోజు సోమవారం ఫస్ట్ నామినేషన్ దాఖలు అయ్యింది. సిలివేరు శ్రీకాంత్ అనే వ్యక్తి రెండు సెట్ల నామినేషన్ పత్రాల దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నాడు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు సిలివేరు శ్రీకాంత్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్. బీఆర్ఎస్ పార్టీ నుంచి మాగంటి సునీత పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఎవరు అనేది ఇంకా ఫైనల్ కాలేదు. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక జరుగుతుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గోపీనాథ్ భార్య సునీత బరిలోకి దిగుతున్నారు.

# ఐపిఎస్ సంజయ్‌కు మరోమారు నిరాశ

**- బెయిల్ ఇచ్చేందుకు ఎసిబి కోర్టు నిరాకరణ**

**విజయవాడ,అక్టోబర్13( వెలుతురు):**

ఐపీఎస్ సంజయ్ కుమార్‌కు ఏసీబీ కోర్టులో నిరాశ ఎదురైంది. ఆయన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో గతంలో సంజయ్‌పై కేసు నమోదైంది. సంజయ్ అగ్నిమాపకశాఖ డీజీ, సీఐడీ ఏడీజీగా పనిచేసినప్పుడు రూ.1.5 కోట్ల మేర ప్రభుత్వ నిధులు దుర్వినియోగమయ్యాయని విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

# మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపులకు టెండర్లు వేసే వారికి ముఖ్య గమనిక

**- వైన్ షాపులు ఊరి బయటే ఉండాలి, సిట్టింగ్ నడపకూడదు, బెల్ట్ షాపులకు మద్యం అమ్మకూడదు, సిండికేట్ ఉండొద్దు**

**- సాయంత్రం 4:00గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకే మధ్యాన్ని విక్రయించాలి**

**- ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం, మానవ జీవన ప్రమాణాలు పెంచడం, బెల్ట్ షాపుల నిర్మూలన, మహిళా సాధికారతే మా ఉద్దేశం**

**- ఎవరిని ఇబ్బంది పెట్టాలని కాదు, నియోజకవర్గ ప్రజలు, యువత మద్యం మత్తును వదిలి ఆర్థికంగా ఎదగాలని నా కోరిక**

**- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**- పై అంశాలతో కూడిన వినతి పత్రాన్ని నల్గొండ ఎక్సైజ్ సూపరింటెంట్ కు అందజేసిన మునుగోడు నియోజకవర్గ ముఖ్య నాయకులు**



**మునుగోడు వెలుతురు అక్టోబర్ 13:**

రాష్ట్రవ్యాప్తంగా నూతన వైన్ షాపులకు టెండర్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైన్ షాపులకు టెండర్లు వేసే వారికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొన్ని సూచనలు చేశారు... నియోజకవర్గంలో ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉన్న నేపథ్యంలో బెల్ట్ షాపుల నిర్మూలన ఉద్యమం చేపట్టి గ్రామాలలో బెల్ట్ షాపులు లేకుండా చేసిన మునుగోడు ఎమ్మెల్యే.. మరో అడుగు ముందుకేసి నూతన వైన్ షాపులను దక్కించుకుంటున్నవారికి కొన్ని విన్నపాలు చేశారు... మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా వైన్ షాపులను దక్కించుకునే వారు ఊరి బయట మాత్రమే వైన్ షాపులను పెట్టుకోవాలని, సిట్టింగు లేకుండా చూసుకోవాలని, బెల్ట్ షాపులకు మద్యం విక్రయించొద్దని, వైన్ షాపుల యజమానులు సిండికేట్ గా మారుద్దని , మద్యాన్ని సాయంత్రం 4:00గంటల నుండి రాత్రి 9:00 గంటలకు మాత్రమే విక్రయించుకోవాలని సూచిస్తున్నారు... ఈ నిర్ణయం ఎవరిని ఇబ్బంది పెట్టడానికి కాదని నియోజకవర్గ ప్రజలు యువత మద్యం మత్తు వదిలి ఆర్థికంగా ఎదగాలనేది నా కోరిక అంటూనే.. ఈ ప్రయత్నం వల్ల ప్రజల ఆరోగ్యం బాగుపడితే వారి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని, ఇంట్లో యజమాని తాగకుండా ఉంటే మహిళలు ఆర్థికంగా సాధికారత సాధిస్తారని అందుకే ఇటువంటి సూచనలు చేస్తున్నామని తెలిపారు. తాను త్రాగుడికి వ్యతిరేకం కాదని, ఉదయం నుండి సాయంత్రం వరకు అదే పని మీద తాగుతూ తాగుడుకు బానిసలుగా మారుతున్న విధానానికి వ్యతిరేకం అన్నారు.. ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసుకోవాలని దాని తర్వాత తాగుడు గురించి ఆలోచించాలని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాలలో పర్యటిస్తున్న సందర్భంలో యువత తాగుడుకు బానిసై విచక్షణారహితంగా ప్రవర్తించడం చూశానని, ఎంతోమంది యువకులు 30 ఏళ్ల లోపు వారే తాగుడుకు బానిసై చనిపోతే మహిళలు చిన్నతనంలోనే భర్తను కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని తమ పిల్లలను పోషించడానికి వారు పడరాని పాట్లు పడుతున్న ఆవేదనలో నుండి వచ్చిన నిర్ణయమే బెల్ట్ షాపుల నిర్మూలన, మద్యం షాపుల సమయాల మార్పు అన్నారు. గత పది సంవత్సరాలుగా గ్రామాలలో సామాజిక రుగ్మతగా మారిన అధికమద్యం సేవనాన్ని తగ్గించి, కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ప్రయత్నమే ఇది అని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పిలుపుమేరకు సోమవారం రోజున మునుగోడు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ కార్యాలయానికి చేరుకుని మునుగోడు నియోజకవర్గం లో వైన్ షాప్ టెండర్లు వేసే వారికి గమనిక అంటూ కొన్ని అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఎక్సైజ్ సూపరిండెంట్ కు అందించారు వినతి పత్రం అందించిన వారిలో చండూరు నాంపల్లి మండలాల ముఖ్య నాయకులు ఉన్నారు..

# అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ

**- ఏపని చేయాలన్నా పర్సెంటీజీలు వసూళ్లు**

**- కాంగ్రెస్ రాకతో అభివృద్ధి వెనక్కి**

**- ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ సురుకు తగలాలి**

**- పార్టీ కార్యకర్తల భేటీలో హరీష్ రావు**



**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను అత్యంత అవినీతి రాష్ట్రంగా మార్చేశారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. ఏ పని జరగాలన్నా కాంగ్రెస్ నేతలు కమిషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. రహమత్‌నగర్‌లో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయి. మా హయాంలో పేదల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఔషధాలు కూడా ఉండటం లేదు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కూలుస్తున్నారు.. పెద్దలవి కూల్చడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని.. 700 రోజులు దాటినా వాటిని అమలు చేయడం లేదని.. అందుకే అందుకే రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సురుకు తగలాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా ముఖ్యమైన ఎన్నిక అని..యావత్ తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడితే రేవంత్ రెడ్డికి కనువిప్పు కలుగుతుందని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. లేకుంటే ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టినా, హామీలు అమలు చేయకపోయినా, హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినా నాకే ఓటు వేశారని రేవంత్ అంటాడని చెప్పారు. ఉద్యోగాలు రావాలన్నా.. పింఛన్లు రావాలన్నా, పథకాలు అమలు కావాలన్నా, హైడ్రా ఆగాలన్నా బీఆర్ఎస్ పార్టీ గెలవాలి, మాగంటి సునీతా గెలవాలన్నారు. రెండేళ్లలో రేవంతు రెడ్డి రాష్ట్రాన్ని అవినీతిమయంగా చేసిండని.. కేసీఆర్ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దితే, అత్యంత అవినీతి రాష్ట్రంగా తయారు చేసిండని మండిపడ్డారు. బిల్డింగ్ పర్మిషన్‌కు స్వేర్ ఫీట్‌కు రూ.75, ఫైనాన్స్ బిల్లు క్లియర్ కావాలంటే 12శాతం కమిషన్ ఇవ్వాలట అంటూ ఆరోపించారు. ఇళ్లు జాగ, భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే 40 శాతం భూములు రాసివ్వాలట.. మొత్తం పర్సెంటేజీలు డిసైడ్ చేసిండని ధ్వజమెత్తారు. ఒకప్పుడు తెలంగాణ అంటే పెట్టుబడులకు స్వర్గధామమని.. తెలంగాణ ఏ పథకం ప్రారంభిస్తే దేశం మొత్తం ఆ పథకం ప్రారంభించేదని.. తెలంగాణ అనుసరిస్తే, దేశం ఆచరించేదన్నారు. ఒక రాష్ట్రం ఎట్ల ఉండాలో కేసీఆర్ తయారు చేస్తే, రాష్ట్రం, సీఎం ఎట్ల ఉండగూడదో రేవంతు తయారు చేసిండని విమర్శించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని.. గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం చేశారని.. కేసీఆర్ 350 బస్తీ దవాఖానలు ప్రారంభించారని.. ఉచితంగా పరీక్షలు చేసే విధంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ప్రారంభిస్తే రేవంత్ ప్రభుత్వం బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిందని.. ఆరు నెలలుగా బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది జీతాలు చెల్లించడం లేదు, మందులు లేవన్నారు. వాళ్లకు జీతాలు ఇవ్వకుండా మీకు వైద్య సేవలు అందకుండా రేవంత్ రెడ్డి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. బస్తీ దవాఖానలు చూస్తే కేసీఆర్ గుర్తుకు వస్తారు, కాబట్టి బస్తీ దవాఖానల ఉనికి లేకుండా చేస్తున్నడని.. నీళ్ల బిల్లులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నపుడు 20వేల లీటర్ల వరకు బిల్లులు లేవని.. రేవంతు వచ్చిందు బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు మాగంటి సునీతమ్మ గెలుపు మాత్రమే కాదని.. తెలంగాణ ప్రజల గెలుపు అని తెలిపారు. హైడ్రా పెట్టి పెద్దోళ్ల ఇండ్లు కూల్చుతలేదు గానీ, పేదోళ్ల ఇండ్లు కూల్చుతున్నడని.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి చీఫ్ విప్, గాంధీల ఇండ్లు, భూములు హైడ్రాకు ఎందుకు కనబడటం లేదని.. గరీబోళ్ల ఇండ్లే హైడ్రాకు కనబడుతున్నాయా? అంటూ నిలదీశారు. 'హైడ్రా కతం హోనాహే.. కాంగ్రెస్ కో హరానేహే.. హైడ్రా బంద్ హోనాతో .. మాగంటి సునితమ్మకో జితానాహే' అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఇండ్ల ముందుకు బుల్డోజర్ వస్తది.. అది రావొద్దు అంటే సునితమ్మను గెలిపించాలని పిలుపునిచ్చారు. ముస్లింలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసిందని.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి ఇవ్వలేదన్నారు. కేసీఆర్ డిప్యూటీ సీఎం, హోం మినిస్టర్ ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్, మహమూద్ అలీ ఇద్దరే మొదట మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు. షాదీ ముబారక్ కింద తులం బంగారం అన్నాడని.. తులం జాడ లేదు గానీ కల్యాణ లక్ష్మి చెక్కు ఏడాది దాటినా ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ కిట్ బందు, బతుకమ్మ చీర బందు, రంజాన్ తోఫా బంద్, ఓవర్సీస్ స్కాలర్ షిప్ బందు, దళిత బందు బందు, బీసీ బందు బందు, బస్తీ దవాఖాన ఖతం పట్టించారని ఆరోపించారు. హిందు, ముస్లీం అందరం కలిసి హైద్రాబాద్‌ను, తెలంగాణను కాపాడుకోవాలన్నారు. ఇది మాగంటి సునితమ్మ గెలుపు కాదని.. బీఆర్ఎస్ కార్యకర్తల గెలుపు, తెలంగాణ గెలుపుగా అందరం కలిసి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ కార్యకర్తలు బాగా కలిసి పనిచేస్తున్నారని.. కేటీఆర్, తాను జూబ్లిహిల్స్‌ను అనుకొని ఉన్నామన్నారు.సునితమ్మకు కుడి, ఎడమ చెయ్యిగా ఉంటామని చెప్పారు. కార్యకర్తలకు ఆపద వస్తే, మెసేజ్ చేస్తే చాలు నేను, తలసాని, కేటీఆర్ ముందుంటామని స్పష్టం చేశారు. ఉద్యమాలు, పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని.. భయపడాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ జూబ్లీహిల్స్ గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్‌ను దించి.. మనం కూడా కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. తమ్ముడు విష్ణువర్ధన్ రెడ్డి సునితమ్మకు తమ్ముడిగా ఎంతో కృషి చేస్తున్నారని.. ఎక్కడ చూసినా కేసీఆర్ కు ఓటు వేస్తాం అని అంటున్నారని.. పెద్ద మెజారిటీతో సునీతమ్మను గెలిపించాలని హరీశ్‌రావు కోరారు.

# మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

**సిఎం రేవంత్, జర్నలిస్ట్ సంఘాల సంతాపం**

**హైదరాబాద్,అక్టోబర్13( వెలుతురు):**



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (83) కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. సోమవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 1982లో కాంగ్రెస్ తరఫున ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగానూ లక్ష్మారెడ్డి పనిచేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నగరంలోని మహా ప్రస్థానంలో మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన కాంగ్రెస్ లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీసీసీ ప్రతినిధి, గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్‌తో పాటు పలు కీలక బాధ్యతలను లక్ష్మారెడ్డి నిర్వర్తించారు. 1999, 2014లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఓటమి పాలయ్యారు.జర్నలిజం పట్ల మక్కువతో లక్ష్మారెడ్డి 1980లో స్థానిక వార్తా సంస్థ ఎన్ఎస్ఎస్ మొదలుపెట్టారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కూడా ఆయన సేవలందించారు. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేసిన కొండా వెంకట రంగారెడ్డి మనవడు లక్ష్మారెడ్డి కావడం గమనార్హం. ఆయన మరణ వార్త తెలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రాజకీయ నేతలు సంతాపం ప్రకటించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మా రెడ్డి మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ వార్తా ఏజెన్సీ స్థాపకుడిగా, ఎమ్మెల్యేగా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ గా ఆయన సేవలందించారని కొనియాడారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు సీఎం సానుభూతి తెలియజేశారు. లక్ష్మారెడ్డి మృతిపట్ల ప్రెస్ అకడామ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అమర్, ఆర్ఎన్ఎ న్యూస్ ఏజెన్సీ ఎడిటర్ రఘు అవ్వారు, జర్నలిస్ట్ సంఘాల నేతలు నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు సంతాపం ప్రకటించారు.

# నోటీసులకు సమాధానం ఇచ్చిన పేర్నినాని

**- పోలీసుల చర్యతో దిగివచ్చిన వైకాపా నేత**

**మచిలీపట్నం,అక్టోబర్13( వెలుతురు):**

మచిలీపట్నం పోలీసులు యాక్షన్ చేపట్టడంతో మాజీ మంత్రి పేర్ని నాని దిగొచ్చారు. ఈ క్రమంలో పేర్ని నానితో సహా మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌కి క్యూ కట్టారు వైసీపీ నేతలు . ఇటీవల మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ వద్ద అనుమతులు లేకుండా ధర్నా చేశారు వైసీపీ నేతలు. ఈ క్రమంలో పోలీసుల అనుమతి లేకుండా ఆందోళన చేయడంతో 400 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. సుమారు 100 మందికి 41ఏ నోటీసులు జారీ చేశారు. నోటీసులకు సమాధానం ఇవ్వకుండా మొన్నటి వరకు పోలీసులతో దోబూచులాడారు ఆ పార్టీ నేతలు. రెండు రోజుల క్రితం వైసీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న అరెస్ట్‌తో వైసీపీ నేతలు అలర్ట్ అయ్యారు. పేర్ని నానితో సహా పోలీస్ స్టేషన్‌కి వచ్చి నోటీసులకు సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతల నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు.

# కూటమిలో మద్యం ప్రకంపనలు

**తిరుపతి, అక్టోబరు 13 (వెలుతురు)**

ఏపీలో నకిలీ మద్యం ప్రకంపనలు సృష్టించింది. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం లో నకిలీ మద్యం శిబిరం వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ అధికారుల తనిఖీలో బయటపడింది. ఈ నకిలీ మద్యం తయారీలో సంబంధం ఉన్నట్టు ఆరోపణలు రావడంతో తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ జయ చంద్రారెడ్డి పై పార్టీ వేటు వేసింది. మరో నేతపై కూడా టిడిపి హై కమాండ్ చర్యలు తీసుకుంది. అయితే దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అస్త్రంగా మార్చుకుంది. అయితే నకిలీ మద్యం పై ఆరోపణలు వచ్చిన వెంటనే తాము చర్యలు తీసుకున్నామని.. ఈ నిందితులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో ముందస్తు ఒప్పందం కుదిరింది అన్న అనుమానాలు ఉన్నాయి. అయితే ఇవేవీ పట్టించుకోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అదే పనిగా ప్రచారం చేస్తోంది. అయితే దీనిపై కేవలం టిడిపి నేతలు కౌంటర్ ఇస్తున్నారు. బిజెపితో పాటు జనసేన నేతలు స్పందించకపోవడం కూటమిలో ఉన్న గ్యాప్ ను తెలియజేస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది మూడు పార్టీల మధ్య సమన్వయం బాగానే నడిచింది. ఇది ఉమ్మడి ప్రభుత్వం కావడంతో ఏ పార్టీపై రాజకీయంగా విమర్శలు వచ్చినా.. తిప్పి కొట్టాల్సిన అవసరం మూడు పార్టీలపై ఉంది. గతంలో చాలా పరిణామాల విషయంలో మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాయి. కానీ ఇప్పుడు నకిలీ మద్యం వ్యవహారంలో మాత్రం తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ దానిని అడ్డుకోవడంలో కేవలం తెలుగుదేశం మాత్రమే ముందుంటోంది. ఈ విషయంలో బిజెపితో పాటు జనసేన నేతలు పెద్దగా కలుగజేసుకోవడం లేదు. దీనిని ఛాన్స్ గా తీసుకుంటోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అదే పనిగా టిడిపి పై వ్యతిరేక ప్రచారం చేస్తోంది కూటమి మరో 15 ఏళ్ల పాటు కొనసాగాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బలంగా కోరుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సూచిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. కూటమిలో తాము ఉన్నామన్న విషయాన్ని మూడు పార్టీలు మరిచిపోతున్నాయి. ఆ పార్టీపై ఆరోపణలు వచ్చాయి కదా.. తామెందుకు స్పందించాలన్న రీతిలో జనసేనతో పాటు బిజెపి నేతలు ఉన్నారు. నకిలీ మద్యం వ్యవహారంలో టిడిపి నేతల పేర్లు బయటకు వచ్చాయి. వారిపై చర్యలు తీసుకుంది పార్టీ నాయకత్వం. గత వైసిపి ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు భిన్నంగా చంద్రబాబు ముందుగానే చర్యలకు ఉపక్రమించారు. కానీ ఎందుకో ఈ విషయంలో జనసేనతో పాటు బిజెపి నుంచి సహాయ నిరాకరణ ఎదుర్కొంటోంది తెలుగుదేశం పార్టీ. ఇలానే ముందుకు సాగితే కూటమిలో ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం. రిమాండ్ రిపోర్ట్ లో సంచలన విషయాలు నకిలీ మద్యం కేసు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు ప్రస్తావించారు పోలీసులు. కల్తీ మద్యం కేసులో కింగ్ పిన్ జనార్ధన్ రావు 2012 నుండి లిక్కర్ వ్యాపారం ప్రారంభించారు. ANR బార్ ను నిర్వహిస్తున్నారు. లాభాలు




వస్తున్న సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో హైవే మీద ఉన్న ANR బార్ ఇతర ప్రదేశానికి మార్చారు. వ్యాపారంలో పోటీ పెరగడం, దీనికి కరోనా తోడవడంతో 2021 వరకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డారు. 2021 నుండి నకిలీ మద్యం తయారీ వ్యాపారం ప్రారంభించారు. మొట్టమొదటిగా హైదరాబాద్ నిజాంపేటలో ఒక గది అద్దెకి తీసుకొని కల్తీ మద్యం తయారీ చేశారు. మద్యాన్ని 35 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాలో నింపి.. కిలీ ఇన్వాయిస్ లతో విజయవాడ ఇబ్రహీంపట్నం పంపించే వాడు. అక్రమ మద్యం డబ్బాలపై ఫినాయిల్ స్టిక్కర్ వేసి ఆర్టీసీ కొరియర్ ద్వారా ఇబ్రహీంపట్నం చేరవేసే వాడు. ప్లాస్టిక్ డబ్బాల్లో మద్యం ఉన్నా ఎటువంటి అనుమానం తలెత్తేది కాదు. కేసులో A5 నిందితుడు హాజీ దాన్ని రిసీవ్ చేసుకునే వాడు. ఈ అక్రమ మద్యాన్ని లీటర్ బాటిల్ లో తన బార్ లో లూస్ విక్రయాలు చేయటం వల్ల పెద్దగా అనుమానం కలగలేదని రిమాండ్ రిపోర్టులో పొందుపరిచారు. 2022లో E 7 పేరుతో మరో ఆరుగురితో కలిసి హైదరాబాద్ లో మరో కొత్త బార్ ప్రారంభించాడు జనార్ధన్. అక్కడి నుండి 35 లీటర్ల బాటిల్స్ లో అక్రమ మద్యం తీసుకొచ్చి ఇబ్రహీంపట్నం ANR బార్ లో అమ్మడం జరిగింది. 2023 జనవరిలో ఆరుగురు భాగస్వాములతో కలిసి గోవా వెళ్లాడు జనార్ధన్ రావు. గోవాలో తెలుగు వ్యక్తి (ఈ కేసులో A3) బాలాజీ లిక్కర్ స్టోర్ లో జనార్ధన్ కు పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి ఇద్దరూ రెగ్యులర్ టచ్ లో ఉన్నారు. ఏపీ లో లిక్కర్ ధరలు ఎక్కువగా ఉండడంతో గోవా నుండి ఖరీదైన లిక్కర్ బ్రాండ్ కొనుగోలు చేస్తున్నారని జనార్ధన్ కు చెప్పాడు బాలాజీ. గోవాలో దొరుకుతున్న ఖరీదైన మద్యం మాదిరి నకిలీ మద్యాన్ని ఏపీకి పంపిస్తానని జనార్ధన్ కు ప్రతిపాదించాడు బాలాజీ. డిస్టలరీస్ తో బాలాజీకున్న పరిచయాలతో క్యారమిల్, స్పిరిట్ ఇతర ముడి పదార్థాలు పంపగా 2023 నుండి ఇబ్రహీంపట్నం ANR బార్ లో కల్తీ మద్యం తయారీ ప్రారంభించాడు జనార్ధన్ రావు. 2023 ఏప్రిల్ నుండి కల్తీ మద్యం తయారీ వ్యాపారం ప్రారంభించాడు జనార్ధన్ రావు. నకిలీ లేబుల్స్ కేసులో A4గా ఉన్న రవి హైదరాబాద్ నుండి సరఫరా చేశాడు. బాటిల్స్ మూతలు హైదరాబాద్ నుండి సరఫరా చేశాడు దారబోయిన ప్రసాద్. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ నుండి ఏపీకి జనార్ధన్ కు ఐరిష్ వ్యాన్ లో సరఫరా చేశాడు బాలాజీ. ANR బార్ లో ఒకరోజు ఉండి కల్తీ మద్యం కోసం మిశ్రమం తయారు చేశాడు బాలాజీ. తర్వాత మిశ్రమం సాయంతో జనార్ధన్ రావు సోదరుడు జగన్ మోహన్ మంజీర విస్కీ, కేరళ మార్ట్ విస్కీ, ఓల్డ్ అడ్మినరల్, క్లాసిక్ బ్లూ వంటి కల్తీ మద్యం తయారు చేశాడు. మొదట కల్తీ మద్యం బాటిల్స్ ANR బార్ లో నే విక్రయించారు.

ఒక్కో క్వార్టర్ బాటిల్ పై 40 రూపాయలు లాభం గడించాన జనార్ధన్ రావు. 2024 ఎన్నికల సమయంలో నిఘా పెరగడంతో బాలాజీ స్పిరిట్ సరఫరా చేయలేదు. కొత్తగా ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరవడంతో కల్తీ మద్యం కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేశాడు జనార్ధన్ రావు. తంబళపల్లి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డికి జనార్ధన్ రావు స్నేహితుడు. టీడీపీ నేత జయచంద్రారెడ్డి అనుచరుడు సురేంద్ర నాయుడు, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ వైన్ షాపులు కొనుగోలు చేశారు. ములకలచెరువుకు చెందిన బాలగిరి సిద్దా ద్వారా రాజేష్, సురేంద్రతో స్నేహం చేశాడు జనార్ధన్ రావు. వారికి మద్యం వ్యాపారంలో అనుభవం లేకపోవడంతో వ్యాపారంలో నష్టం చవిచూశారు. దాంతో షాపులు జనార్ధనరావు పర్యవేక్షణ చేయమన్నారు. 2025 మే, జూన్ లో ములకలచెరువులో కల్తీ మద్యం తయారీ ప్రారంభించాడు జనార్ధన్ రావు. అదే సమయంలో ఇబ్రహీంపట్నంలో కూడా కల్తీ మద్యం తయారీ వ్యాపారం ప్రారంభించి విక్రయాలు జరిపాడు. జయచంద్రారెడ్డి ఆఫ్రికాలో ఉన్నాడని తెలిసి అక్కడికి గత నెల 25న వెళ్ళాడు జనార్ధన్ రావు. ఆఫ్రికాలోని రువాండలో జనార్ధన్ ఉన్న సమయంలో ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం తయారీపై దాడులు నిర్వహించారు. అది తెలుసుకుని జనార్ధన్ ఇండియాకు వచ్చాడు" అని రిపోర్టులో పొందుపరిచారు.

## పాలిటిక్స్ కి రాయపాటి ఫ్యామిలీ దూరం

**గుంటూరు, అక్టోబరు 12 (వెలుతురు)**



రాజకీయంగా ఒక వెలుగు వెలిగిన చాలా కుటుంబాలు తర్వాత కనుమరుగయ్యాయి. అటువంటి జాబితాలో చాలా కుటుంబాలు ఉన్నాయి. అయితే గుంటూరు జిల్లాలో తనకంటూ రాజకీయం చేసిన రాయపాటి కుటుంబం ఇప్పుడు.. స్వచ్ఛంద విరమణ చేయాల్సి వచ్చింది. ఆ పరిస్థితులు దాపురించాయి. చిన్న వయసులోనే కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజ్యసభలో అడుగుపెట్టారు రాయపాటి సాంబశివరావు. తెలుగుదేశం ప్రభంజనంలో సైతం ఆయన గెలిచిన సందర్భాలు ఉన్నాయి. అయితే రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితుల్లోకి వెళ్ళింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో టిడిపిలోకి వచ్చారు రాయపాటి. ఒకసారి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఎన్నికల్లో ఆయనకు కానీ.. కుటుంబానికి కానీ ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు చంద్రబాబు. దీంతో ఎన్నికలకు ముందు రాయపాటి కుమారుడు టిడిపి నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అందుకే టిడిపి అధికారంలోకి వచ్చినా ఆ కుటుంబానికి ఎటువంటి ప్రాధాన్యం లేకుండా పోయింది. అందుకే ఆ కుటుంబం పూర్తిగా రాజకీయాలనుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 1982లో తెలుగుదేశం పార్టీ ( ఆవిర్భవించింది. ఆ సమయంలో యువజన కాంగ్రెస్ లో ఉన్నారు రాయపాటి సాంబశివరావు. కమ్మ సామాజిక వర్గం నేత కావడంతో ఆయనను గుర్తించింది కాంగ్రెస్ పార్టీ. తొలిసారిగా రాజ్యసభకు నామినేట్ చేసింది. అప్పుడు ఆయన వయసు కేవలం 39 సంవత్సరాలు మాత్రమే. అటు తరువాత కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని నేతగా ఎదిగారు రాయపాటి. 1996, 1998, 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా గెలిచారు. 2014లో టిడిపి తరఫున పోటీ చేసి మరోసారి పార్లమెంట్ సభ్యులు అయ్యారు. 2019లో టిడిపి తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో తనతో పాటు తన కుమారులను పోటీ చేయించాలని చూశారు. కానీ మారిన సమీకరణ నేపథ్యంలో చంద్రబాబు చాన్స్ ఇవ్వలేదు. 2024 ఎన్నికల్లో రాయపాటి సాంబశివరావు నరసారావు పేట పార్లమెంట్ సీటును ఆశించారు. గుంటూరు నుంచి కూడా అవకాశం కోరారు. కుమారుడు రంగారావుకు సత్తెనపల్లి టికెట్ అడిగారు. కానీ సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కు ఛాన్స్ దక్కింది. గుంటూరు నుంచి పారిశ్రామికవేత్త పెమ్మసాని చంద్రశేఖర్ కు అవకాశం ఇచ్చారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలకు అవకాశం ఇచ్చారు. దీంతో రాయపాటి కుమారుడు రంగారావు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటుతోంది. కానీ ఇంతవరకు రాయపాటి సాంబశివరావుకు ఎటువంటి పిలుపు లేదు. దీంతో రాజకీయాలనుంచి నిష్క్రమించడమే మేలని ఆ కుటుంబం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి వారి నిర్ణయం ఎలా ఉంటుందో?

## గొట్టిపాటికి కలిసి రాని కాలం

**విజయవాడ,అక్టోబరు 12 (వెలుతురు)**



కొందరు మంత్రుల తీరుతో సీఎం చంద్రబాబు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీఎం ఫైర్ అయినట్లు సమాచారం. ముఖ్యంగా విద్యుత్ శాఖపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల చార్జీలు తగ్గించిన సంగతి తెలిసిందే. ట్రూ డౌన్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం చార్జీలను తగ్గించింది. చార్జీలు తగ్గించడం ఉమ్మడి ఏపీలో ఇదే తొలిసారి. కానీ దీనిపై విద్యుత్ శాఖ ప్రజల్లోకి బలంగా వెళ్లకపోవడంపై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున చార్జీలు తగ్గిస్తే ప్రచారం చేసుకోకపోతే ఎలా అంటూ క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుంటే ఏం చేస్తున్నారు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను చంద్రబాబు మందలించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి క్యాబినెట్ సమావేశం జరిగిన ప్రతిసారి మంత్రుల వ్యవహార శైలి చర్చకు వస్తోంది. కొంతమంది మంత్రులకు ఉద్వాసన తప్పదని ప్రచారం జరుగుతోంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు మాత్రమే అవుతోంది. సాధారణంగా మంత్రివర్గ విస్తరణ అనేది రెండేళ్లకు ఒకసారి జరుపుతారు. గత వైసిపి ప్రభుత్వం అయితే అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత విస్తరణ చేపట్టింది. కానీ చంద్రబాబు సర్కార్లో అధికారంలోకి వచ్చిన మూడు నెలల తరువాత నుంచి వింత ప్రచారం జరిగింది. మంత్రుల మార్పు ఉంటుందన్నది దాని సారాంశం. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. అయితే తాజాగా విద్యుత్ చార్జీలకు సంబంధించి ప్రజలకు చెప్పుకోవడంలో విఫలమయ్యా మన అసంతృప్తి చంద్రబాబులో కనిపిస్తోంది. దీనిపై సంబంధిత మంత్రి గొట్టిపాటి రవికుమార్ పై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే క్యాబినెట్ సమావేశం జరిగిన ప్రతిసారి ఇటువంటి ప్రచారం జరగడం సర్వసాధారణంగా మారింది. ఇందులో ఎంత మాత్రం నిజం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కోస్తా, రాయలసీమ జిల్లాల నుంచి నలుగురు మంత్రులపై వేటు అని ఎప్పటినుంచో ప్రచారం సాగిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం అటువంటి చర్యలకు దిగలేదు. ఇప్పుడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పై వేటు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే రాజకీయంగా ఆయన బలమైన నేత. ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకునే అవకాశమే లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## పత్తి పొలాల్లో దొంగలు పడ్డారు

**కర్నూలు , అక్టోబరు 13 ( వెలుతురు)**

పంట పొలాలు బాగా పూసి, పత్తి కాయలు తెల్లగా మారుతుంటే.. కొందరికి ఆ పంటను చూసి అసూయ పుడుతుంది. అందుకే చాలా మంది రైతులు దిష్టిబొమ్మలు పెట్టి పంటను కాపాడుకుంటారు. కానీ కర్నూల్ జిల్లాలోని కోసగి ఊరికి చెందిన రైతు కోసిగయ్యకు ఆ అవకాశం కూడా లేకపోయింది. ఎకరం 50 సెంట్ల భూమిలో పత్తి వేసి, దానికి పెట్టుబడి కింద లక్షా యాభై వేలు ఖర్చు చేశాడు. మంచి పంట వచ్చింది. అప్పులు తీరిపోతాయని, కొంత ఊపిరి పీల్చుకుంటానని అనుకున్నాడు. ముందు రోజు వెళ్లి పండిన పంట చూసుకుని.. ఇక కోయిద్దాం అని కూలోళ్లను కూడా మాట్లాడుకున్నాయి. తెల్లారి వెళ్లి చూస్తే చేనులో పత్తి అంతా మాయమైంది మొత్తం పత్తిని ఎవరో రాత్రికి రాత్రే దోచుకుపోయారు. ఇంట్లో అందరం కష్టపడి పంట వేసాం. వానలతో కొంత నష్టం వచ్చినా, చివరికి బాగానే పండింది. కానీ రాత్రికి రాత్రే 15 క్వింటాళ్ల పత్తి దోచుకుపోయారు. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావట్లేదు" అంటూ బాధపడుతున్నాడు కోసిగయ్య. ఇలా దొంగతనాలు పెరగడంతో, రైతులు ఇప్పుడు పంటకావలికి కూడా సీసీ కెమెరాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాపాడుకోవడమే కాదు.. ఇప్పుడు పంటను కూడా కాపాడుకోవడం రైతులకు కొత్త సవాలుగా మారింది. ఇంత పెద్ద ఎత్తున పత్తి బస్తాలు దొంగతనం అవుతుంటే, తప్పక సీసీ కెమెరాలు ఏదో చోట పడతాయి. ఆ దొంగలను పట్టుకుని పంట రైతుకి తిరిగి ఇచ్చినా కోసిగయ్యకు కొంత ఊరట దొరుకుతుంది.

## వైసీపీ నేతల్లో అసంతృప్తులు

**విజయవాడ, అక్టోబరు 13 (వెలుతురు)**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పరిస్థితులు క్షణం క్షణం మారిపోతున్నాయి. ఏపీలో ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవడంతో ఆ పార్టీలో కీలకంగా పనిచేసిన పలువురు నేతలు అధికార కూటమి వైపు మొగ్గు చూపారు. ఆ సమయంలో ఆ పార్టీ భవిష్యత్తు లేదని భావించిన నేతలు, వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ స్థిరత్వం కోసం టిడిపి జనసేన పార్టీలలో చేరారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారినట్లు తెలుస్తోంది. తాజాగా ఆ నేతల్లో కొందరు మళ్లీ వైసీపీ వైపు మొగ్గుచూపుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జిల్లాల వారీగా చూస్తే, వైసీపీని విడిచి వెళ్లిన వారిలో చాలా మంది కొత్త పార్టీల్లో సరైన గుర్తింపు పొందలేదనే భావన కలిగింది. ముఖ్యంగా మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి , ఆళ్ల నాని, మోపిదేవి వెంకటరమణ వంటి నేతలకు కూటమి ప్రభుత్వంలో పెద్దగా ప్రాధాన్యం దక్కలేదని అంటున్నారు. ఒకప్పుడు జిల్లాల్లో ప్రభావవంతమైన నేతలుగా ఉన్న వీరు ఇప్పుడు కొత్త పార్టీల్లో రెండో శ్రేణి నేతలుగా మారిపోయిన పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యేలు ఉదయభాను, కిలారు రోశయ్య , పెండెం దొరబాబు వంటి వారు తమ స్థాయిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నా, పార్టీ అంచనాలకు తగ్గ గుర్తింపు అందలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదయభాను ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడిగా పని చేస్తున్నప్పటికీ, పెద్దగా రాజకీయ ప్రభావం చూపలేకపోయారు. ఇదే సమయంలో దొరబాబు పిఠాపురం ప్రాంతంలో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ, ఆయనకూ పెద్దగా అవకాశాలు రాలేదు. వైసీపీకి చాలా కాలం సన్నిహితుడిగా ఉన్న మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి అయితే రాజకీయ సన్యాసం ప్రకటించి పూర్తిగా పార్టీకి దూరమయ్యారు. కానీ పార్టీని విడిచి వెళ్లిన ఇతర నేతలు మాత్రం ఇప్పుడు మళ్లీ పాత గూటికి చేరాలా అనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు ఇప్పటికే వైసీపీ నాయకులతో అనధికారికంగా సంప్రదింపులు ప్రారంభించినట్టు చెబుతున్నారు. మరికొందరు మాత్రం జగన్ మోహన్ రెడ్డి నుంచి ఆహ్వానం వస్తే తిరిగి చేరతామని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నేతల పరిస్థితి "ముందుకెళ్తే నుయ్యి, వెనక్కి వస్తే గొయ్యి" అన్నట్లు మారింది. కొత్త పార్టీల విధానం, పనితీరు తమ రాజకీయ ధోరణికి సరిపోకపోవడం వల్ల వారు అసహనంతో ఉన్నారని చెబుతున్నారు. తమ గత రాజకీయ జీవితం వైసీపీ, అంతకు ముందు కాంగ్రెస్ వాతావరణంలో సాగిందని, ఇప్పుడు కూటమి పార్టీల ధోరణి పూర్తిగా భిన్నంగా ఉందని కొందరు సన్నిహితుల వద్ద వాపోతున్నారని సమాచారం. ఇలా, ఈ రాజకీయ వలసదారుల భవిష్యత్తు ఏ దిశలో సాగుతుందో, నిజంగా ఎవరైనా మళ్లీ వైసీపీలో చేరుతారా లేదా అన్నది చూడాల్సిందే. కానీ ఈ ప్రచారం మాత్రం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తావిస్తోంది.

## 40 ఏళ్లుగా రిపేర్ లేని రోడ్డు

**పూణె, అక్టోబరు 13 (వెలుతురు)**



మన భారతదేశంలో కొన్ని ప్రయాణాలు చేసేటప్పుడు గతుకుల రోడ్లు.. డ్యామేజ్ అయినా రహదారులు కనిపిస్తూ ఉంటాయి. అయితే కొత్తగా వేసిన రోడ్డు సైతం కొన్ని రోజుల తర్వాత వెంటనే గుంతలు పడడం లేదా డ్యామేజ్ అవ్వడం జరుగుతుంది. కానీ పూణేలోని ఓ రోడ్డు 48 సంవత్సరాల కిందట వేయగా.. ఇప్పటివరకు ఆ రోడ్డు చెక్కుచెదరకుండా ఉంది. అంతేకాకుండా 2.5 కిలోమీటర్ల వరకు ఒక్క గుంత కూడా కనిపించదు. అసలు విషయం ఏంటంటే ఈ రోడ్డు నిర్మించే ముందే కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి ఒక సవాలు విసిరారు. 10 సంవత్సరాల వరకు ఈ రోడ్డుపై ఒక్క గుంత ఉన్న కూడా తిరిగి రోడ్డు మొత్తం వేస్తామని అన్నారు.. కానీ 48 సంవత్సరాల వరకు ఆ రోడ్డు నాణ్యతతో ఉంది. ఇంతకీ ఆ రోడ్డు పూణేలో ఎక్కడ ఉంది? దీనిని నిర్మించింది ఎవరు? ఆ తర్వాత వీరికి జరిగిన నష్టం ఏంటిపూణే లోని జంగ్లీ మహారాజ్ రోడ్.. దీనినే ప్రస్తుతం JM రోడ్డు అని పిలుస్తున్నారు. శివాజీ నగర్ నుంచి దక్కన్ జింఖానా వరకు 2.5 కిలోమీటర్ల వరకు 6 రోడ్డు కనిపిస్తుంది. దీనిని 1976 జనవరిలో ప్రారంభించారు. 1972లో మహారాష్ట్రలో కరువు, మరదల కారణంగా పూణేలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో కొందరు రాజకీయ నాయకులు మాట్లాడుతూ ముంబైలోని రోడ్లు ఎన్నో వరదలు వచ్చినా కూడా తట్టుకొని ఎందుకు ఉంటున్నాయి? అన్న ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో ముంబైకి చెందిన రెకాండో అనే సంస్థ హార్ట్ మిక్స్ హాట్ mix అనే టెక్నాలజీతో రోడ్లను నిర్మిస్తుందని కొందరు చెప్పారు. ఈ రికండో సంస్థను పార్శి సోదరులు నడిపేవారు. ఈ విషయం తెలుసుకున్న పూణేలోని కార్పొరేటర్ శ్రీకాంత్ శిలోరే పట్టుదలతో పార్శ బ్రదర్స్ కు శివాజీ నగర్ రోడ్డు కాంటాక్ట్ గా అప్పగించారు. అయితే వారు కాంటాక్ట్ లో పేర్కొన్న ప్రకారం.. 10 సంవత్సరాల వరకు రోడ్డు నాణ్యత దెబ్బతింటే తిరిగి పూర్తిగా నిర్మిస్తామని సవాల్ విసిరారు. వీరు ఈ రోడ్డు నిర్మించే సమయంలో నాణ్యతను ఉపయోగించి హాట్ mix టెక్నాలజీని ఉపయోగించారు. భవిష్యత్తులో కేబుల్స్, తుఫాను వంటి నీటి కాలువల కోసం రోడ్డు అంచున ప్రత్యేకంగా డక్టులను ఏర్పాటు చేశారు. ఈ విధంగా వారు వేసిన రోడ్డు 48 సంవత్సరాల వరకు నాణ్యతతో కూడుకొని ఉంది. ఇప్పటివరకు ఈ రోడ్డుపై ఎక్కడ గుంత ఏర్పడలేదు. 2010లో స్వల్ప మరమ్మతులు మినహా రోడ్డుకు నిర్వహణ ఖర్చులు ఎక్కడ అవసరం పడలేదు. అయితే దురదృష్టం ఏంటంటే ఈ ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత రికండో కంపెనీకి మళ్లీ కొత్త ప్రాజెక్టు రాలేదు. పార్శ బ్రదర్స్ వయసు ఎక్కువగా కారణంగా వారు మరో ప్రాజెక్టు చేపట్టలేదు అన్న ప్రచారం ఉంది. ఇటీవల వేసిన చాలా రోడ్లు, బ్రిడ్జిలు ఏడాది తిరగకముందే నాణ్యతను దెబ్బతింటున్నాయి. అలాంటి వారికి ఈ JM రోడ్డు స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు.

# చర్లపల్లి జైలు దేశానికి ఆదర్శం

## ఖైదీల సంక్షేమంలో నెంబర్ వన్

- ఖైదీలకు బీమా, కుటుంబ సభ్యులకు వడ్డీలేని రుణ సదుపాయం కల్పించడం అభిందనీయం
- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ భేష్
- కస్టడీ-కేర్-కరక్షన్ కు ఆచరణ రూపమిస్తున్న జైళ్ల శాఖ
- ఖైదీల ఉత్పత్తులతో ప్రత్యేక మేళా నిర్వహించండి
- కేంద్రం నుండి సంపూర్ణ సహకారం అందిస్తా
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి
- చర్లపల్లి జైలును సందర్శించిన కేంద్ర మంత్రి
- జైళ్లలో సంస్కరణలు, ఖైదీల సంక్షేమంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన అధికారులు
- విడుదలైన ఖైదీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు వెల్లడి
- మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్నట్లు వివరణ




**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** ఖైదీల సంక్షేమంలో చర్లపల్లి జైలులో చేపడుతున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఖైదీలకు బీమా సౌకర్యం కల్పించడంతోపాటు, వారి కుటుంబ సభ్యులకు వడ్డీలేకుండా రుణ సదుపాయం కల్పించడం అభిందనీయమన్నారు. మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదవిస్తూ ఫీజులను కూడా జైళ్ల శాఖ చెల్లించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ ను అభినందించకుండా ఉండలేమన్నారు. కస్టడీ-కేర్-కరక్షన్ కు సౌమ్య మిశ్రా నిజమైన ఆచరణ రూపమిస్తున్నారని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం రోజున చర్లపల్లి జైలును సందర్శించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. చర్లపల్లి జైలులో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీలను, వారు తయారు చేస్తున్నఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. గోశాలను సందర్శించారు. గోవులకు స్వయంగా తన చేతితో మేత తిన్పించారు. ఒక లేగ ఆవుకు 'క్రిష్ణ' అంటూ నామకరణం చేశారు. జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్, బంతి పూల వనాన్ని సందర్శించారు. తేనె టీగలతో తేనె ఏ విధంగా పడుతున్నారనే విషయాన్ని స్వయంగా తిలకించారు. అనంతరం ఖైదీల కోసం జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. 25 ఏళ్ల క్రితం చర్లపల్లి జైలును నిర్మించారని నాటి నుండి నేటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్లపల్లి జైలు అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.11.60 కోట్లు మంజూరు చేయగా, రూ.



11.30 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. సౌమ్య మిశ్రా జైళ్ల శాఖ డీజీగా బాధ్యతలు చేపట్టిన తరువాత విప్లవాత్మకంగా సంస్కరణలు చేపట్టారన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులకు వీడియో లింక్ ద్వారా తాము ఉన్న ప్రాంతాల నుండే మాట్లాడే (ములాఖత్) అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఖైదీలకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. ఖైదీలు చదువుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పించడంతోపాటు చదవు పూర్తయ్యాక డిగ్రీలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల ఆరోగ్యంపైనే ప్రత్యేక ద్రుష్టి సారించామని, నిష్ణాతులైన డాక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు సగటున 150 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ప్రతి రోగికి ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ ను రూపొందించినట్లు వివరించారు. ఖైదీలకు ప్రతిరోజు యోగా, ధ్యానం, పీఈటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో ప్రత్యేకంగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు విడుదలైన తరువాత పెట్రోలు బంకుల్లో ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నెలా రూ.18 వేల చొప్పున కనీస వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అట్లాగే జైళ్ల శాఖ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, క్రీడా విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రీడా పోటీల్లో తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. జైళ్ల శాఖ అందిస్తున్న సేవలు, చేస్తున్న అభివృద్ధికి గాను ప్రతిష్టాత్మకమైన స్కోడా అవార్డు వచ్చినట్లు వివరించారు. ఖైదీల సంక్షేమం, చర్లపల్లి జైలు అభివృద్ధి విషయంలో జైళ్ల శాఖ డీజే విజన్ అద్భుతమని కేంద్ర మంత్రి కొనియాడారు. ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖలు సైతం చర్లపల్లి జైలును సందర్శించి సంస్కరణలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉన్నందున హైదరాబాద్ లో 'ప్రత్యేకంగా మేళా' నిర్వహించి ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించాలని సూచించారు. జైళ్ల శాఖకు కేంద్రం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, చర్లపల్లి జైలు సూపరింటెండ్ శివకుమార్ గౌడ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





















# ఒక్క ముద్దు సనన్నివేశం లేదు

## తెలుసుకదా ట్రైలర్ విడుదలలో సిద్ధూ




సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన రొమాంటిక్ డ్రామా మూవీ 'తెలుసు కదా' రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో టీమ్ పంచుకున్న విశేషాలివి. సిద్ధూతో రొమాంటిక్ సినిమా తీయాలనే ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్నకు ఈ కాన్సెప్ట్‌కు సిద్ధూ అయితేనే న్యాయం చేయగలరని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం అని దర్శకురాలు నీరజ కోన అన్నారు. మొదట చూపిన ప్రచార చిత్రాలకు ఇప్పుడు రిలీజ్ చేసిన వాటికి సంబంధం లేనట్లు ఉంది? కావాలనే అలాంటి పోస్టర్స్ రిలీజ్ చేశారా? అని అడగ్గా కావాలని చేసింది కాదు. సినిమా ప్రారంభించినప్పటి నుంచి ప్రచార చిత్రాలు విడుదల చేస్తూ వచ్చాం అని సిద్ధూ అన్నారు. షూటింగ్ చేసే క్రమంలో కొన్ని మార్పులు చేశాం. అందుకే అలా డిఫరెంట్‌గా ఉన్నాయి. ట్రైలర్‌తో కథను చెప్పాలని అనుకున్నాం. దీపావళికి పోటీ చాలా ఉంది. ఆ సమయంలోనే విడుదల చేయడం రిస్క్ అనిపించడం లేదా? అంటే.. రిస్క్ ఉన్నచోటే విజయం ఉంటుంది. నా గత చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఒక సినిమా నన్ను కింద పడేస్తే.. మరొకటి టాప్‌లో చేర్చుతుందని నమ్ముతాను. ఈ సినిమాలో పాత్ర 'టిల్లు' పాత్రను పోలి ఉందా? అని అంటే...దానికి, దీనికి సంబంధం ఉండదు. ఇందులో దానికి మించిన వినోదం ఉంటుందన్నారు. ఎప్పుడూ ఇద్దరు హీరోయిన్లతో మూవీ చేస్తున్నారని ఎందుకని అడిగితే...నేను ఇప్పటివరకూ ఇద్దరు హీరోయిన్లతో చేసింది ఒకే సినిమా 'కృష్ణా అండ్ హిజ్ లేడీ'. దానిలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు. 'టిల్లు స్క్వేర్'లో అతిథి పాత్రలో మరో హీరోయిన్ ఉన్నారంతే. లవ్ స్టోరీ కాబట్టి దానికి తగినట్లే తెరకెక్కించారు. ఇందులో ముద్దు సన్నివేశాలు లేవు. ఒక్క ముద్దు సీన్ కూడా ఉండకూడదు అని కథ చెప్పినప్పుడే నీరజకు కండీషన్ పెట్టా. ఇది ఫ్యామిలీ మూవీ. ఇద్దరు హీరోయిన్లు, దర్శకురాలు, నిర్మాత.. అందరూ మహిళలే.. వాళ్లందరితో వర్క్ చేయడం సరదాగా అనిపించింది. రాశీ ఖన్నా అయితే క్లైమాక్స్‌లో నేను చేయను అని 40 నిమిషాలు సెట్ నుంచి వెళ్లిపోయింది. 'నా బాయ్‌ఫ్రెండ్ ఇలా చేస్తే నేను అంగీకరించను' అని పక్కకి వెళ్లి కూర్చొంది. ఇది కేవలం పాత్ర అని చెప్పి తీసుకొచ్చాను. సెట్‌లో 16 మంది మహిళలు ఉండేవారు. వాళ్లందరిలో నేను ఒక్కడినే ఉండేవాడిని. ఇకపోతే సినిమా అన్నాక.. డబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి.. నాకు రికవరీ అనేది ఎమోషనల్‌గా కావాలి. ఫైనాన్షియల్‌గా కాదు. రవితేజతో గతంలో ఒక సినిమా ఎ÷-లాన్ చేశాం. కానీ, అది ఆగిపోయింది. ఒకవేళ మా ఇద్దరికీ సరిపోయే కథ ఉంటే కచ్చితంగా చేస్తాం అని సిద్ధూ అన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న కృతిశెట్టి

## వేరుగా వచ్చిన ఎన్టీఆర్ సతీమణి ప్రణతి



తిరుమల శ్రీవారిని సినీ నటి కృతి శెట్టి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను కృతి శెట్టికి అందజేశారు. అలాగే తిరుమల శ్రీవారిని జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీ ప్రణతి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో నూతన వధూవరులు నార్నె నితిన్ దంపతులతో కలిసి స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.


# హిందీలో రీమేక్ కానున్న సంక్రాంతికి వస్తున్నాం

తెలుగు బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ కానుందంటూ నెట్టింట పలు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో అనీల్ రావిపూడి తెరకెకక్కించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం గత సంక్రాంతి 2025 సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది . దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఈ క్రమంలో చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. బాలీవుడ్ రీమేక్ స్టార్ అక్షయ్ కుమార్‌తో సంప్రదింపులు కూడా చేస్తున్నట్టు టాక్ నడుస్తుంది. అక్షయ్ కుమార్ ఇప్పటికే 'భూల్ భులయ్యా 2', 'రౌడీ రాథోర్', 'లక్ష్మీ' వంటి దక్షిణాది రీమేక్‌లతో హిట్ ట్రాక్‌లో ఉన్నారు. అయితే ఇటీవల వరుస ఎ÷-లాపులతో అక్షయ్ కుమార్ కెరీర్ ఒడిదుడుకుల్లో సాగుతోంది. ఈ సమయంలో ఆయన మళ్లీ సౌత్ ఇండస్ట్రీ సూపర్ హిట్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి కథను ఎంచుకుంటే సేఫ్ జోన్‌లో పడతాడని విశ్లేషకులు కూడా అంటున్నారు. బాలీవుడ్ ట్రేడ్ వర్గాల ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఈ సినిమాను హిందీలో నిర్మించేందుకు బాలీవుడ్ మేకర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం . వెంకటేష్ చేసిన పాత్రకు అక్షయ్ కుమార్ సరైన ఎంపిక అని చాలా మంది భావిస్తున్నారు. తెలుగులో ఈ సినిమా విజయానికి కథ కంటే కూడా వెంకటేష్ టైమింగ్, కామెడీ టచ్, అనిల్ రావిపూడి మేకింగ్ ప్రధాన కారణాలుగా నిలిచాయి. అయితే బాలీవుడ్ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కథ, స్క్రీన్‌ప్లేలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటివి లేకపోతే , ఈ సినిమా డిజాస్టర్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్ల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




# ఆనంద్ దేవరకొండ..తక్షకుడు


బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ సీరిస్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్ఛ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం.




తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి. థియేటర్‌తో పాటు ఓటీటీలో విడుదలైన సినిమాలు కూడా ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఓటీటీ ట్రెండ్‌ను ఫాలో అవుతూ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇలా యాక్షన్ ఫిల్మ్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'తక్షకుడు'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. వినోద్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు..' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

# డిజైనర్ మనీశ్ మల్హోత్రా ఇంట్లో దీపావళి వేడుకలు

## సినీ ప్రముఖులతో పాటు నీతా అంబానీ హాజరు





భారతీయులు అత్యంత ఘనంగా జరుపుకునే పండగల్లో దీపావళి ఒకటి. ప్రస్తుతం ఈ పండగకి వారం రోజులే సమయం ఉండటంతో దేశవ్యాప్తంగా సంబరాలు మొదలయ్యాయి. ప్రజలు తమ ఇళ్లను అందంగా అలంకరించుకోవడం ప్రారంభించేశారు. వెలుగుల పండగను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఇక బాలీవుడ్ ఇండస్ట్రీలో దీపావళి సందడి వారం ముందే వచ్చేసింది. తారలు పార్టీలంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్రా తన ఇంట్లో.. స్నేహితులు, కుటుంబ సభ్యులకు దివాళి పార్టీ ఇచ్చారు. ఈ పార్టీకి పలువురు బీటౌన్ తారలు హాజరై సందడి చేశారు. కరీనా కపూర్ , హేమ మాలినీ, జెనీలియా, కరణ్ జోహార్, రేఖ, ప్రీతి జింటా, అనన్య పాండే, కృతి సనన్, కాజోల్, అదితిరావ్ హైదరి, వాణీ కపూర్, సొనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్, మలైకా అరోరా, సారా అలీఖాన్, ఖుషీ కపూర్, సుహానా ఖాన్ తదితరులు పార్టీకి హాజరయ్యారు. భారత్‌లోనే అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ కుటుంబం కూడా ఈ పార్టీలో మెరిసింది. నీతా అంబానీ, రాధిక మర్చంట్ దివాళీ పార్టీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక దుస్తుల్లో అందరినీ ఆకర్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.





# జై హనుమాన్‌పై రిషబ్ వ్యాఖ్యలు


## సినిమా ఆలస్యం కానుందన్న సంకేతాలు

'కాంతార చాప్టర్ 1'తో మళ్లీ ఒక్కసారి బాక్సాఫీస్‌ను శాసించిన కన్నడ స్టార్ రిషబ్ శెట్టి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'జై హనుమాన్' గురించి చేసిన కామెంట్స్‌తో హాట్ టాపిక్ అయ్యాడు. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, రిషబ్ చేసిన తాజా వ్యాఖ్యలతో ఫ్యాన్స్ కాస్త నిరాశలో ఉన్నారు. 'కాంతార చాప్టర్ 1' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రిషబ్ శెట్టి, తన తదుపరి ప్రాజెక్టుల గురించి స్పందించారు. 'చాప్టర్ 1 తర్వాత నేను చేస్తున్న సినిమా 'జై హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమా 2026 జనవరిలో సెట్స్‌పైకి వెళ్తుంది. ఆ తర్వాత నా డైరెక్షన్‌లో మరో సినిమా ఉంటుంది, అది రెండేళ్లలో వస్తుంది' అని ఆయన వెల్లడించారు. ఈ కామెంట్స్ విన్న తర్వాత అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇప్పటికీ షూటింగ్ ప్రారంభం కాలేదా? 2026 జనవరి అంటే సినిమా రిలీజ్‌కు ఇంకెన్నాళ్లు? అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో 'జై హనుమాన్' సినిమా నుంచి రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ అయినప్పుడు షూటింగ్ స్టార్ట్ అయిందన్న భావన అభిమానుల్లో ఏర్పడింది. కానీ ఆ ఫొటో కేవలం ఫోటోషూట్ మాత్రమేనని, అసలు షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందనే క్లారిటీ ఇప్పుడే వచ్చింది. 2026 జనవరిలో సెట్స్ పైకి వెళ్తే, పోస్ట్-ప్రొడక్షన్, గ్రాఫిక్స్, ప్రమోషన్స్ అన్నింటినీ కలుపుకుంటే ఈ సినిమా విడుదలకు కనీసం 2027 వరకు వేచి చూడాల్సి రావచ్చు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే గ్యాప్‌లో రిషబ్ శెట్టి దర్శకత్వం వహించే మరో ప్రాజెక్ట్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం, 'హనుమాన్' సినిమా సీక్వెల్ కావడంతో ఇప్పటికే భారీ బజ్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించిన 'హనుమాన్' తర్వాత ప్రేక్షకులలో 'జై హనుమాన్'పై భారీ అంచనాలున్నాయి.

# మర్చంట్ నేవీ లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు

**- కెప్టెన్ అశుతోష్ విజయ్ ఆపండ్కర్**




**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**
డీజీ షిప్పింగ్ సాగర్ మే సమ్మాన్ కార్యక్రమం లో భాగంగా మర్చంట్ నేవీ లో ఇంటర్ పదవతరగతి ఐటిఐ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని టీఎస్ రహమాన్ ప్రిన్సిపాల్,డిజి షిప్పింగ్ నోడల్ అధికారి కెప్టెన్ డాక్టర్ అశు తోష్ అన్నారు. సోమవారం రోజున నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ (మహిళ) ,ముషీరాబాద్ ఐటీఐ లో నిర్వహించిన సెమినార్ లో ఆయన మాట్లాడుతూ నేవీ రంగంలో మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాలని,మహిళా సాధికారత సాధించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. పదవతరగతి ఇంటర్ ఐటిఐ తర్వాత మర్చంట్ నేవీ లో ఆరు నెలల శిక్షణ



ఉంటుందని వెంటనే 100 శాతం ఉద్యోగాలు మంచి జీతంతో దొరుకుతాయని తెలిపారు. ట్రైనింగ్ షిప్ రహమాన్ మర్చంట్ నేవీ శిక్షణలో అనేక కోర్సులు అందిస్తుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం నుండి మర్చంట్ నేవీ లో ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థిని భీమగాని సత్య




మాట్లాడుతూ విద్యార్థులు రొటీన్ కు భిన్నంగా ఆలోచించాలని, ప్రత్యేక శిక్షణతో నేవీ రంగంలోకి మంచి జీతంతో అడుగు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ రహమాన్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశుతోష్ విజయ్ అపండ్కర్ తో పాటు,అధ్యాపకురాలు మనీషా పోండే,భీమగాని సత్యా, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్(మహిళా)ప్రిన్సిపాల్ ఎస్ ప్రియ, ముషీరాబాద్ ఐటిఐ



ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి,ప్లేసెమెంట్ ఆఫీసర్ విశ్వపాలక్ రెడ్డి,ట్రైనింగ్ ఆఫీసర్ మోహన్ బాబు, ATO శ్రీనివాస్ ,సీనియర్ జర్నలిస్ట్ భీమగాని మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అంచం తీసుకుంటే చూస్తూ ఊరుకోం

**- సివిల్ తగాదాల్లో తలదూరిస్తే కఠిన చర్యలు**

**- రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డిజిపి హెచ్చరిక**




**న్యూఢిల్లీ,అక్టోబర్13( వెలుతురు):**
పోలీసులు లంచగొండులుగా మారినా, సివిల్ తగాదాల్లో తలదూర్చిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరిచారు. పోలీస్ స్టేషన్‌లలో సివిల్ వివాదాలకు తావు లేదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సివిల్ వివాదాల కోసం సివిల్ కోర్టులు ఉన్నాయని వివరించారు. పోలీస్ స్టేషన్ అడ్డాగా సివిల్ పంచాయితీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలని డీజీపీ ప్రస్తావించారు. యూనిఫాం, అవినీతి ఒకే దగ్గర ఉండవని తేల్చిచెప్పారు. ఒక్క పోలీస్ అధికారి అయినా లంచం తీసుకుంటే డిపార్ట్‌మెంట్ మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పుకొచ్చారు. డిపార్ట్‌మెంట్‌లో లంచం తీసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల భద్రత పోలీసు ప్రధాన బాధ్యత అని ఉద్ఘాటించారు. పోలీస్ సిబ్బంది వెల్ఫేర్ తన వ్యక్తిగత ప్రయారిటీ అని చెప్పు కొచ్చారు. ఫెయిర్ అండ్ ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీసింగ్ తన ఫిలాసఫీ అని నొక్కిచెప్పారు డీజీపీ శివధర్ రెడ్డి. కేసుల విషయంలో బేసిక్ పోలీసింగ్‌తో పాటు టెక్నాలజీని వాడాలని సూచించారు. పేద ప్రజలు ఆపదలో ఉంటే పోలీసులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆపదలో ఆదుకున్న వాళ్లని పేదలు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## చిరుత దాడిలో చిన్నారి మృతి

**- వలవేసి చిరుతను పట్టేసిన అధికారులు**

**పుణె,అక్టోబర్13( వెలుతురు):**
పొలంలో పని చేస్తున్న తాతకు తాగునీరు తీసుకెళ్తున్న ఐదేళ్ల చిన్నారిపై చిరుత పులి దాడి చేసింది. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పింపార్ఖేడ్ గ్రామంలో ఆదివారం తమ ఇంటి సమీపంలోని పొలంలో పని చేస్తున్న తాతకు మంచినీళ్లు ఇవ్వడానికి శివన్య శైలేష్ బొంబే అనే ఐదేళ్ల చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే నక్కిఉన్న చిరుతపులి ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేసి పొలాల్లోకి ఈడ్చుకుపోయింది. దీన్ని గమనించిన అక్కడే పనిచేస్తున్న కొందరు వ్యక్తులు కర్రలతో చిరుతను తరమడంతో కొద్ది దూరంలో చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించినా చిన్నారి మెడకు తీవ్ర గాయాలవడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిరుతపులిని గుర్తించడానికి కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగించామని.. 10 బోన్లు ఏర్పాటుచేశామని ఫారెస్ట్ డివిజన్ అధికారి పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిరుత బోనుకు చిక్కిందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. స్థానికులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు.

# నకిలీ మద్యం సూత్రధారి జోగి రమేశ్

**- ఆయన కనుసన్నల్లోనే మద్యం తయారీ**

**- తంబళ్లపల్లిలో మద్యంతో బాబుపై బురదజల్లే యత్నం**

**- తనను ఆస్ట్రేలియాకు పంపి ..లీకులిచ్చిన జోగి**

**- నిందితుడు జనార్ధన్ రావు సంచలన వీడియో విడుదల**



**విజయవాడ,అక్టోబర్13( వెలుతురు):**
నకిలీ మద్యం కేసులో నిందితుడు జనార్దన్‌రావు సంచలన విషయాలు బయటపెట్టాడు. వైకాపా పాలనలో జోగి రమేశ్ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీ జరిగిందని పేర్కొన్నాడు. కూటమి ప్రభుత్వం రాగానే నిఘా పెరగడంతో తయారీ ఆపేసినట్లు వివరించాడు. ఏప్రిల్‌లో జోగి రమేశ్ ఫోన్ చేసి నకిలీ మద్యం తయారు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు సహకరించాలని కోరారు. నకిలీ మద్యం తయారీ మొదట ఇబ్రహీంపట్నంలో పెట్టాలనుకున్నాం. జోగి రమేశ్ ఆదేశాలతో తంబళ్లపల్లిలో తయారీ ప్రారంభించాం. తంబళ్లపల్లి అయితే చంద్రబాబుపై బురద జల్లోచ్చని జోగిరమేశ్ చెప్పారని జనార్దన్ రావు తెలిపాడు.ఏపీ నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అద్దేపల్లి జనార్దన్ రావు సంచలన విషయాలు బయటపెట్టారు . వైసీపీ పాలనలో జోగి రమేష్ ఆధ్వర్యంలో నకిలీ మద్యం తయారీ చేసినట్టు ఆయన చెప్పారు. అయితే, ఏపీలో ప్రభుత్వం మారగానే నకిలీ మద్యం తయారీ నిలిపివేశామని జనార్దన్ రావు చెప్పుకొచ్చారు. నకిలీ మద్యం తయారీ వెనుక జరిగిన అన్ని విషయాల్నీ జనార్దన్‌రావు ఒక వీడియో రూపంలో వెల్లడించారు. ఇప్పుడు ఈ వీడియో రాజకీయ వర్గాలను కుదిపేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జోగి రమేష్ మళ్ళీ నకిలీ మద్యం తయారు చేయమన్నారని జనార్దన్ రావు వెల్లడించారు. 'కూటమి ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టించే కుట్రతో.. మళ్ళీ నకిలీ మద్యం తయారీ మొదలు పెట్టాలని జోగి రమేష్ నాతో చెప్పారు. ఇబ్రహీంపట్నంలో పెట్టాలి అనుకున్నా కానీ, జోగి రమేష్ ఆదేశాలతో.. తంబళ్లప్లలె నియోజకవర్గంలో నకిలీ మద్యం తయారీ మొదలుపెట్టాం. తంబళ్లప్లలె నుంచి ప్రారంభిస్తే ప్రభుత్వంపై బురద జల్లొచ్చని జోగి రమేష్ అన్నారు. రూమ్ అద్దెకు తీసుకొని లిక్కర్ తయారీకి అన్ని యంత్రాలు తీసుకొచ్చాం. ఆర్థిక ఇబ్బందులు నుంచి బయట పడేస్తానని జోగి రమేష్ నాకు హామీ ఇచ్చారు. అంతా రెడీ అయ్యాక నన్ను ఆఫ్రికాలో ఉన్న ఫ్రెండ్ దగ్గరకు పంపారు. జోగి రమేష్ తన మనుషుల ద్వారా లీక్ ఇచ్చి రైడ్ చేయించారు. తద్వారా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కుట్ర చేశాడు.' అని జనార్ధన్ రావు సంచలన విషయాలు బయటపెట్టారు. అంతేకాదు, 'టీడీపీ నుంచి సస్పెండ్ చేయడంతో జోగి రమేష్ మరో ప్లాన్ వేశారు. ఇబ్రహీంపట్నంలో కూడా రైడ్ చేయిద్దాం సరుకు తీసుకొచ్చి పెట్టు అని అన్నారు. జోగి రమేష్ చెప్పినట్టే లీక్ ఇచ్చి రైడ్ చేయించారు, సాక్షి మీడియా కూడా ముందే ఉంది. అనుకున్నది జరిగింది.. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చింది. నువ్వు ఇక్కడకు రావాల్సిన అవసరం లేదని జోగి రమేష్ అన్నారు. అంతా చూసుకుంటా బెయిల్ ఇప్పిస్తానని చెప్పి జోగి రమేష్ హ్యాండ్ ఇచ్చాడు. నా తమ్ముడిని కూడా నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ ఇరికించాడు. జై చంద్రారెడ్డికి నకిలీ మద్యంతో అసలు సంబంధం లేదని జనార్దన్ రావు చెప్పారు.

## బెంగాల్ తరహాలో జార్ఖండ్‌లో ఘటన

**- రాంచిలో 14 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్**

**- ఐదుగురు దుండగులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**రాంచి,అక్టోబర్13( వెలుతురు):**
అమ్మాయిలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఆడవారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. బెంగాల్ మెడికోపై అత్యాచార ఘటన మరవక ముందే జార్ఖండ్‌లో ఓ ఘటన కలచివేసింది. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. కామాంధుల్లో మార్పు రావడం లేదు. పశ్చిమ బెంగాల్ లో ఓ వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగింది. ఈ ఘటన మరువక ముందే తాజాగా జార్ఖండ్ లో అదే తరహా ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్ రాజధాని రాంచీలోని రతు ప్రాంతంలో 14 ఏళ్ల బాలిక తన కుటుంబంతో నివాసం ఉంటుంది. అయితే ఆదివారం ఆ బాలికపై కామాంధులు కాటేశారు. రాత్రి సమయంలో 9 మంది వ్యక్తులు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. సోమవారం పలు ప్రాంతాల్లో పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు కూడా నిర్వహించామని పోలీస్ సూపరింటెండెంట్ ప్రవీణ్ పుష్కర్ తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. అలానే నిందితులపై పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని రతు పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి అధికారి రాం నారాయణ్ సింగ్ తెలిపారు.



## శాంతి ఒప్పందంలో బందీల విడుదల

**- స్వాగతించిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ,అక్టోబర్13( వెలుతురు):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో భాగంగా సజీవంగా ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేయడాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్లకు పైగా హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలను స్వాగతిస్తున్నాం. బందీల స్వేచ్ఛ.. సంబంధిత కుటుంబాల ధైర్యానికి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్థిరమైన శాంతి ప్రయత్నాలకు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దృఢ సంకల్పానికి గుర్తింపుగా నిలుస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాల కు మద్దతు ఇస్తున్నాం' అని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్‌లు ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ క్రమంలోనే నేడు 20 మంది సజీవ బందీలను హమాస్ అప్పగిం చింది. 28మంది ఇజ్రాయెల్ పౌరుల మృతదేహాలను కూడా త్వరలోనే అప్పగించనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com